2015 ఆగష్టు

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-



**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపోస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| యజమానుని పుస్తకము | మామయ్య కథలు ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 09 |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| సాక్ష్యము | రాజామణి, హైదరాబాద్ | 14 |
| మధ్యకాలము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 15 |
| మర్మములు | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | 18 |
| దర్శనములు | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 20 |
| సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును | డి.విద్యావతి, విజయవాడ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |



India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



క్రీస్తునందు ప్రియులైన పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు.

చాలాకాలంగా అభిమానుల కోరిక దృష్ట్యా వచ్చేనెల నుండి "ఉత్తరాలు-జవాబులు" శీర్షిక మొదలు పెట్టుచున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. గమనించవలసినదిగా మనవి. యోగ్యమైన ప్రతి ఉత్తరమునకు జవాబు పత్రికా ముఖంగా ఇవ్వబడుతుంది. కొంతమంది "కలం-స్నేహితులు" కార్యక్రమము మొదలు పెట్టమని అడుగుచున్నారు. ఆ కార్యక్రమము వలన చాలా ఇబ్బందులకు గురు కావలసి వస్తుంది కనుక ఆ కార్యక్రమము ప్రవేశ పెట్టుట జరుగదు. క్షమించవలసినది.

"ఇలా అయితే బావుంటది" అనే ఇంకొక నూతన శీర్షిక కూడా త్వరలో మొదలు పెట్టబడుతుంది. దీనిలో ఈ అంత్యదినాలలో సైతానుడు చెలరేగి అక్రమాలు చేస్తున్న ఈ రోజుల్లో సేవా కార్యక్రమాలకు ఆటంకము కలిగిస్తున్న తరుణంలో క్రైస్తవులందరు ఆత్మల రక్షణార్ధము ఎలా సేవా కార్యక్రమాలు నడిపిస్తే బావుంటుందో మీ సలహాలు ఒక పేజీకి మించకుండా వ్రాసి పంపితే, ఎన్నికైన వాటిని ప్రచురించగలము.

ప్రియ పాఠకులందరూ ఈ 'పరిశుద్ధత' మాస పత్రిక కొరకు ప్రార్థించవలసినదిగా మనవి. దయచేసి మా యొక్క సేవా కార్యక్రమాలైన అనాథ ఆశ్రమము, స్కూలు, నర్సింగ్ విద్య, టి.వి. పరిచర్య కొరకు దయచేసి ప్రార్థించండి.

ఐ.ఈ.ఆర్.ఎఫ్. సేవా పరిచర్య కొరకు ఆర్థికముగా సహాయము చేయదలచిన వారు ఈ క్రింది అకౌంట్ నంబరు ద్వారా సహాయపడగలరు.

**K. Joseph, Current A/c No. 13510200000175, Federal Bank, Ongole**

దేవుడు మిమ్మును దీవించును గాక!

-ఎడిటర్

సీరియల్

# అపొస్తులుడు

18

– కొడవటికంటి

సౌలుకు ఏదో రహస్యం చెప్తున్నట్లుగా కయపగారు ముందుకు తలవంచాడు. అది గమనించి సౌలు తన కుడి చెవిని ఆయన దగ్గరగా ఉంచాడు.

"నజరేయుని నివాసము కపెర్నహోము. అక్కడ ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో ఆయన ఎక్కువకాలం గడిపాడు. కాని కపెర్నహోములోని సమాజమందిరపు పరిసయ్యులు, సద్దూకయ్యులు, హెరోదీయులు, నజరేయుని అమితంగా ద్వేషించారు. కనుక అక్కడ మీకు అంత శ్రమ ఉండదు" అంటూ 'ఇక బయలు దేరండి' అన్నట్లుగా ప్రక్కకు జరిగాడు.

సౌలు ఒంటె మీదకు రాగానే అన్ని ఒంటెలు ఒక్కసారిగా లేచి నిలుచున్నవి. చిన్నగా ప్రయాణం మొదలయింది.

అప్పుడు పగలు రమారమి నాలుగు గంటలవేళ అయింది. ఇక ఎన్ని రోజులైనా ప్రయాణం ఇలానే అనుకున్నాడు. యెరూషలేము ఒక్క నదిని కూడ నోచుకోని పట్టణం. సిలోయమను కోనేరు లేకపోతే ఎక్కడనుండి వచ్చేవి – త్రాగటానికి నీరు? ద్రాక్షాతోటలోకి పరిమితమైన సారము ఇంక ఏమాగాణి సేద్యానికి పనికిరాదు. మానవుడు, దేవుని వైపు చూచి ఆహారం తీసుకోవటం ఇక్కడే నేర్చుకోవాలి.

మానవుడు దేవుని మీద ఆధారపడేటట్లుగా చేయబడినవాడు, అందులోనే సంతోషము, తృప్తి ఉంది.

యెరూషలేము మెట్ట ప్రాంతమైనా కిరీటంలోని రాయి వంటిదే! అమూల్యమైన వర్షాకాలంలో ఎప్పుడైనా కొద్దిపాటి మంచి ముద్దమంచు పడుతుంది – తెల్లని గడ్డమంచు. ఆ రోజు ప్రజలందరు పండుగ చేసుకొంటారు.

ఒంటెల వరుస, యెరూషలేము వీధులలో ఉత్తరము వైపుగా ప్రయాణం సాగింది. దమస్కుగవిని ద్వారా పట్టణము దాటారు. కుడివైపున కల్వరికొండ దాటినప్పుడు వచ్చే చిన్న శిఖరం మీదనుండి చూస్తే, దాని వెనుక భాగమున గెత్సెమనే వనం కనబడుతుంది.

సాయంకాలము ఎదురెండ అయింది. ప్రయాణమంతా ఇలాగ సాగుతుంది. ఎండవేళ ఇసుక ప్రాంతములో ప్రయాణం – వడగాలుల మధ్య కష్టము అయినా, సాయంకాలం ప్రయాణం అంతా సూర్యుని ఎదురుగా సాగవలసినదే! ఈ ప్రయాణంలో ఎంత సాధువైనా, ఒంటె అయినా తొందరగా అలసిపోతుంది.

రీఫత్, సౌలు ప్రక్కనే వస్తున్నాడు. అతనికి ఒంటె ప్రయాణం అంతగా అలవాటులేదు. గుర్రం మీద ప్రయాణం ఇష్టం. అసలు ఈ ప్రయాణానికి అందరు గుర్రాలే వాడాలని రీఫత్ పట్టుపట్టారు. కాని గలలియ సముద్రముదాటిన తర్వాత ముప్పైమైళ్ళ తర్వాత ప్రయాణం అంతా ఎడారిలో, ఇసుకలో గుర్రపు ప్రయాణం మంచిదికాదు, గనుక ఒంటె మీదనే ప్రయాణం చెయ్యవలసి వచ్చింది.

యెరూషలేము దాటిన కొంచెంసేపటికి 'రామా' పట్టణం వచ్చి బేతేలు వరకు ప్రయాణం చెయ్యాలని నిశ్చయించుకున్నందున రామాలో ఆగలేదు. ప్రయాణం మొదలైనపుడు ఒంటెల మీద ఉన్న బంట్రౌతులు అందరూ ఏదో ఒక విషయం మాట్లాడుతూ ఉండేవారు. కాని ఇపుడు మాట్లాడవలసిన వన్నీ అయిపోయినట్లు నిశబ్దంగా కూర్చుని ఉన్నారు.

ప్రతి బంట్రౌతు తన ప్రయాణ సామాగ్రి మొత్తం – ఎవరి ఒంటెమీద వారు కట్టుకొని ఉన్నారు.

బేతేలు ఒకప్పుడు చిక్కని అడవి. ఈ బాటలో తనకంటె ముందు దైవకార్యము మీద ఎందరో నడిచారు. ఎంతో చక్కటి భవనాలు, బాటలు ఇప్పుడు ఏర్పడినవి. రోమియులు వచ్చిన తర్వాత పాలస్తీనాయొక్క నైసర్గిక స్వరూపమే మారిపోయింది. ఒక పాలస్తీనాయే కాదు. ప్రపంచమంతా ముస్తాబు చేయబడింది. ఇప్పటికి వంద సంవత్సరాల క్రితం 'మెక్కాబీస్' యొక్క యుద్ధములలో పట్టణం యొక్క అందం కొద్దిగా చెదరినా, మరలా తొందరలోనే ముస్తాబు చేసుకున్నది. ఈ ప్రదేశములోనే దేవుని నిచ్చెన భూమిని ఆనింది కాబోలు అనుకుంటూ, పట్టణం నడిబొడ్డున కొంచెం విశ్రాంతిగా ఒక పానీయశాల వద్ద ఆగి, మరలా బయలుదేరారు. అక్కడ

నుండి బయలు దేరిన కొంచెంసేపటికి పడిపోయిన కట్టడాలు, త్రవ్వబడిన సమాధులు. "ఏమిటవి?" రీఫత్‌ని అడిగాడు.

"ఇవికూడ 'మెక్కబీస్' యుద్ధపు గుర్తులు" అని చెప్పాడు రీఫత్.

రాత్రి ఎనిమిది గంటలకు షిలోహు చేరి ఊరికి వెలుపలే పట్టణంలో ప్రవేశింపకముందే కోనేటివద్ద విడిది చేసారు. అక్కడ నుండి రీఫత్ సమాజమందిరం వద్దకు వెళ్ళి మందిరపు అధికారిని పిలుచుకొని వచ్చాడు. సౌలు వస్తున్న సంగతి ముందుగా యూదయ, సమరయ, గలతియ ప్రదేశాలలో తెలియపరచబడినది. ప్రధానయాజకులు మహాసభ యొక్క తాకీదులు పాలస్తీనా దేశమే కాకుండా దమస్కువారికి కూడ పంపించారు. నజరేయుని శిష్యులుకూడ ముందు జాగ్రత్తగా దమస్కు మార్గంలో ఉన్న మిగిలిన భద్రత దృష్ట్యా వారికి సమాచారము పంపించారు. కనుక పాలస్తీనా దేశమంతట సౌలు అనే పేరు మ్రోగిపోయింది.

సౌలును అంతకుముందు ఎరుగనివారు కూడ ఈ తార్సు యువకుణ్ణి చూడాలని ఎదురు చూస్తున్నారు. ఇంతవరకు, యెహోవా దేవునికొరకు ఈ విధమైన దండయాత్ర ఇశ్రాయేలు చరిత్రలో 600 సంవత్సరాల క్రితం మాత్రమే జరిగినది. తర్వాత 400 సంవత్సరాల క్రితం ఎజ్రాగారు దేశములో ఉజ్జీవము తీసుకొని వచ్చినా, అది యెరూషలేముకు మాత్రమే పరిమితము.

సౌలు యెరూషలేములో వెలిగించిన హింసాజ్యోతి వేడి – ఉత్తరాన దమస్కు వరకే అనుకున్నాడు. కాని ఇంకా 340 మైళ్ళ దూరంలో ఉన్న అంతియొకయ వరకు ప్రాకిన సంగతి తెలియదు. యేసు నామమునకు వ్యతిరేకముగా తన తలపెట్టిన హింసలో స్రవించిన రక్తం, యేసు నామ జ్యోతిని నలుదిశలకు వెలిగించుటకు చమురుగా మారింది.

షిలోహు మందిరపు అధికారి, అతని అనుచరులు వచ్చి సౌలు గారిని పట్టణంలోకి రమ్మని ఆహ్వానించారు. కాని మొదట "ఇక్కడ నజరేయుని శిష్యులు ఎంతమంది ఉన్నారు" అని సౌలు వారిని అడిగాడు. మీరు వస్తున్న సంగతి శిష్యులకు ముందుగా సమాచారం అందినందువల్ల వారు వేరే గ్రామాలలో ప్రస్తుతం తలదాచు కోవటానికి వెళ్ళార"ని చెప్పాడు.

బేతేలులో కూడ అటువంటి సమాచారం తెలుపబడినది. అందువల్ల ఇక మార్గమధ్యములో వీరిని బంధించటం సాధ్యం కాదు అనుకున్నారు.

ప్రతిరోజు తెల్లవారకముందే ప్రయాణం సాగించి ఉదయం తొమ్మిది గంటలకు మజిలీ చేసేవారు.

మధ్యాహ్నం బయులదేరి సాయంకాలం ఎనిమిది గంటలకు బసచేసేవారు.

షిలోను నుండి మజిలీ సమయానికి 'నాయీను' గ్రామం చేరారు. ఆ ఊరి గవిని సమీపిస్తుంటే రీఫత్ తన ఒంటెను తొందరగా నడిపి, సౌలును చేరుకుంటుంటే సౌలు తన ఒంటెను నిలిపాడు.

"ఈ గవిని యొద్దనే యేసు ఒక ధనవంతురాలైన విధవరాలి ఏకైక కుమారుని శవాన్ని బ్రతికించాడు" అని అన్నాడు.

ప్రతి గ్రామము, పట్టణాలలో ప్రవేశిస్తున్నప్పుడు సౌలు హృదయంలో 'సైఫను' అనిన మాటలు మ్రోగుతుండేవి.

'ప్రభువా వారి మీద ఈ పాపము మోపకుము' అనే శబ్దం వినిపించినట్లు ఉండేది. అప్పుడు సౌలుకు కడుపులో చెయ్యి పెట్టి కెలికినట్లుండేది. రాత్రి సమయంలో పండుకొనినప్పుడు ఆనాడు రాళ్ళ వర్షం కురవక ముందు సైఫను తన కండ్లలోకి చూసిన చూపు – ఆచూపు – తనను వెంటాడుతున్నట్లుగా, ఇప్పుడు తన పరుపు ప్రక్కనే నిలబడినట్లుగా....

మీ పితరులు ప్రవక్తలలో ఎవరిని హింసింపక ఉండిరి...? అనినట్లు, యెరూషలేములో తను – శిష్యులను హింసించినప్పుడు శిష్యులను చంపుటకు ఒప్పుకొనినప్పుడు,

మీ పితరులు ప్రవక్తలలో – ఎవరిని హింసింపక ఉండిరి..? అనినట్లుగా భావించేవాడు. పగలంతా ప్రయాణం చేసిన నిద్ర తన కన్నులకు దూరమైంది. తను ఇప్పుడు అనుభవిస్తున్న మానసిక క్షోభ ఒక దొంగ ఊబి, జిగటగల ఊబి. ఇందులో తను ఎంత వెలుపలికి రావాలని

ప్రయత్నిస్తున్నాడో, అంతగా లోపలికి కూరుకొని పోతున్నాడు.

ఇప్పుడు నజరేయుని నామముకు తోడు, సైఫను యొక్క రూపం తనను వేధిస్తుంది. తను నజరేయుని ఎన్నడు చూడలేదు. కాని 'నజరేయుడు దేవుని కుడి పార్శ్వమున నిలుచుండుట' నేను చూస్తున్నాను అని అరచిన సైఫను యొక్క ముఖం, ఇంతకుముందు తన చూచిన ఏ మానవునికి సాటియైనది కాదు. సౌలు తన ఒంటెమీద ముందుకు వంగి ఆలోచిస్తుంటే, రీఫత్ తనలో తాను మాట్లాడుకొన్నట్లుగా "ప్రతి గ్రామంలోకి, పల్లెలోకి ప్రవేశిస్తున్నప్పుడల్లా మీ ముఖం చూస్తుంటే ఒక విధమైన భావనతో మారిపోతున్నారు" అన్నాడు. సౌలు ఆ విషయానికి జవాబివ్వకుండా "నువ్వు ఇందాక చెప్పిన ఆ యువకుడు అదే యేసు బ్రతికించినవాడు, ఇప్పుడు ఈ ఊరిలో ఉన్నాడా?" అని అడిగాడు.

రీఫత్ కొంచెంసేపు సౌలు ముఖంలోకి చూసి "నజరేయుడు బోధింప మొదలుపెట్టి ముగించిన మూడు సంవత్సరాలలో తిరిగిన గ్రామాలలో, పట్టణాలలో ఆయనను ఎందరు ఒంటరిగా కలుసుకొన్నారో, వారందరు – ఆయన మరణించిన రోజునుండి ఆయన శిష్యులై ఆయన నామ వ్యాప్తి కొరకు కృషి చేస్తున్నారు. కాబట్టి మరణించి, లేచిన యువకుడు కూడ అట్లాగ ఉండియుండవచ్చును" అని చెప్పాడు.

తాబోరు కొండ ఎక్కినప్పుడు రీఫత్ – సౌలుకు ఎడమ ప్రక్కన కుడిచేయి చూపుడు వ్రేలు చూపిస్తూ "అదిగో, అదే నజరేతుకొండ. దాని మీద కట్టబడిన గ్రామం నజరేతు" అన్నాడు.

"ఎందుకు కొరగాని కొండ. ఒక నది ప్రక్కనగాని, జలాశయం ప్రక్కనగాని కట్టబడలేదు. ఆ ఎత్తుగా కనబడే కోసుకొనగాని ఆ కొండకి లేకపోతే – అసలు అది కొండకాదు" అన్నాడు సౌలు.

"ఆయన యూదయలోని బెత్లెహేములో మహా హేరోదు ముగింపు కాలములో తీయబడిన జనాభా లెక్కలలో పుట్టాడట" అన్నాడు రీఫత్.

సౌలు ఆలోచిస్తున్నప్పుడు, అతని నుదుట చర్మము ముడతలు పడుతుంది. కోటేరుముక్కు స్పష్టమౌతుంది. పైకనుబొమ్మలు గుబురుగా రెండు కలిసిపోయినవి.

"యూదయ బేత్లెహేమా! నీవు యూదా ప్రధానులలో ....." అని ఆగిపోయాడు. "నా ప్రజలకు...... నీలో నుండి......" అని ఆగిపోయాడు.

నజరేతు చాలా దగ్గరలో ఉన్నట్లుగా కనిపిస్తుంది. దాదాపు ఆరు మైళ్ళ దూరంలో ఉండవచ్చును. ఆ గ్రామం ప్రక్కగా ఉన్న విశాలమైన రాచబాట – ఐగుప్తు, సిరియా, దమస్కు వెళ్ళే రాచబాట. ఇప్పుడు తను ప్రయాణం చేస్తున్న బాటలో కలుస్తుంది.

రీఫత్ కల్పించుకొని "మొట్ట మొదట యేసును హత్య చెయ్యటానికి ప్రయత్నించిన వారు ఆయన పెరిగిన నజరేతువారే!" అన్నాడు.

"ఎందుకు?" సౌలు అడిగాడు.

"బాప్తిస్మము ఇచ్చే యోహానుగారి దగ్గర బాప్తీస్మము తీసుకొని, కొంతకాలం ఎస్సీనుల దగ్గర గడిపాడు. తర్వాత నజరేతు గ్రామం వచ్చి తన వాడకు చొప్పున సమాజమందిరములో ఆయన వాక్య భాగము తెరిచి చదివి మెస్సయ్యను గురించి ప్రవచనము ఇప్పుడు తనతో నెరవేరింది అన్నాడు.

అయినా అక్కడి పెద్దలు మౌనంగా ఉన్నారు. కపెర్నహూములో తాను చేసిన అద్భుతకార్యములు ఇక్కడ చెయ్యమని మీరు అడుగుతారు కాని... అది దేవుని యొక్క మహిమ. ఏలియాకాలంలోను, తర్వాత ఎలీషా ప్రవక్త కాలంలోను, విశ్వాసము ఇశ్రాయేలులో ఉండిన ఇశ్రాయేలీయులు పొందలేదు కాని, అన్యజనాంగములోని అన్యులు మాత్రమే అనుభవంలోకి తెచ్చుకోగలిగారు" అని చెప్పి వారి దైవ భక్తిమీద ఆయన దెబ్బతీసినందువల్ల ఆయనను ఆ కొండపేటు మీద వరకు నెట్టుకొని పోయారు. అక్కడ నుంచి ఆయనను క్రిందకు త్రోసి చంపివెయ్యాలి అనుకొన్నారు."

"తరువాత..?" అని అంటున్న సౌలు మనస్సులో సైఫను కనిపించాడు. ఔను అతనిని చంపేటప్పుడు కూడ అతను మౌనంగా ఉన్నాడు. తనను చంపటానికి వస్తున్న రాళ్ళను ఆహ్వానిస్తున్నట్లు ఉన్నాడు.

**(సశేషం)**

# ఒక మనిషికి ఎంత నేల కావలెను? 17

## (లియో టాల్‌స్టాయ్)

ఇప్పుడు పామ్ గొప్ప పొలానికి యజమాని అయ్యాడు. విత్తనాలు అప్పు తెచ్చి చల్లాడు. పంట బాగా పండింది. తను చెల్లించవలసిన అప్పులన్ని తీర్చాడు. సొంత పొలంలో తన సొంత పశువులకు మేత ఉంది. గింజలు ఇంట్లో ఉన్నాయి. ఇదంతా చూచి తన తెలివితేటలకు చాలా సంతోషించాడు. సాతాను కూడా చాలా సంతోషించాడు. పామ్ తన గుప్పిట్లో చిక్కాడు అనుకున్నాడు. అలా ఓ సంవత్సరం గడిచిపోయింది. పామ్‌కి ఇక్కడ అంతా పాతబడిపోయింది. పల్లెలోని పశువులు తన పొలంలో మేతకి వస్తే తరిమేవాడు. ఒకరోజు తన పొలం చివరికి వెళ్ళాడు. అక్కడ నాలుగు చెట్లు నరకబడి వాటి మొద్దులు మాత్రం ఉన్నాయి. చెట్లు ఏమైనట్టు? తన పొలంలో దొంగలుపడ్డారు. ఎవరీ పని చేసివుంటారని ఆలోచించాడు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చాడు. సైమన్ మాత్రమే ఈ పని చెయ్యగలడు అనుకున్నాడు. సైమన్ ఇంటి చుట్టుప్రక్కల గమనించాడు. నరకబడిన చెట్లు కనిపించలేదు. కాని అతనికి సైమన్ మీదనే అనుమానం ఉంది. కనుక గ్రామ పంచాయితీలో సైమన్ మీద దావా వేశాడు. పంచాయితీ వారు రెండుసార్లు సైమన్‌ని పిలిపించి విచారించినా సాక్ష్యము లేనందున పామ్ ఓడిపోయాడు. గ్రామ పెద్దల మీదకు తగాదాకు వెళ్ళాడు. మీరు ఏదో లంచము తీసుకొని దొంగను వదిలివేశారని అరిచాడు. అదే సమయంలో ఈ పల్లెవాసులందరు గ్రామాలను వదిలి వేరేచోటికి వలసపోతున్నారని వదంతి పుట్టింది. ఒకరోజు పామ్ విశ్రాంతిగా ఇంటిముందు కూర్చుని ఉన్నాడు. ఓ బాటసారి ఆ దారిన వెళ్తూ ఉంటే పిలిచి మంచినీళ్ళు ఇచ్చి అతనితో మాట కలిపాడు. ఆ రాత్రి కూడా అతనికి ఆతిథ్యము ఇచ్చాడు. ఆ బాటసారి 'ఓల్గా' అవతలనుండి వస్తున్నానని చెప్పాడు. మాటలమధ్యలో చాలామంది జనం ఓల్గాలో స్థిరపడటానికి అక్కడికి వెళ్తున్నారని చెప్పాడు.

"ఓల్గాలో పొలాలు బాగా పండుతాయి. అక్కడికి వెళ్ళిన వారందరికి పాతిక ఎకరాలు అక్కడ నివశించే ఉమ్మడి ప్రజలు ఊరకనే ఇస్తారు" అని చెప్పాడు.

పామ్ హృదయం బహుగా ఆశపడింది. ఈ ఇరుకు గ్రామంలో ఉండి ఏమి సాధిస్తాము? తగాదాలు తప్ప. ఇక్కడ ఉన్నదంతా అమ్మి అక్కడికి వెళ్ళి చవకగా గొప్ప పొలం సంపాదించి గొప్పవాడిని అయిపోవచ్చు అనుకున్నాడు.

ఎండాకాలం వచ్చేటప్పటికి ఒక్కడే బయలుదేరి ఓడ ఎక్కి 'సామరా' చేరాడు. అక్కడినుండి మూడు వందల మైళ్ళు కాలినడకన ఆ ప్రదేశం చేరాడు. ఆరోజు ఆ బాటసారి చెప్పినట్లుగానే అంతా బాగుంది. అక్కడి సంగతులన్ని బాగా పరిశీలించి తిరుగుప్రయాణమయ్యాడు. ఇంటికి వచ్చి తనకు కలిగినదంతా అమ్మకానికి పెట్టాడు. లాభానికే తన పొలం అమ్మాడు. పశువులను అమ్మాడు. తన కుటుంబమునంతా తీసుకొని బయలుదేరాడు.

అతను ఓల్గా రాగానే ఓ పెద్ద గ్రామములో వారి సమిష్టి సంఘములో చేరడానికి వినతి పత్రం సమర్పించాడు. అతని కుమారులకు అతనికి కలిపి 125ఎకరాలు ఉమ్మడి సేవాసంఘము వారు ఇచ్చి అందుకు కావలసిన పత్రాలు కూడా ఇచ్చారు. పామ్ స్థిరపడిన తర్వాత ఆదాయం బాగా పెరిగింది. అతను నాట్లు వేసినప్పుడు ఆదాయం బాగా వచ్చింది. ఇంకా పొలం ఉంటే ఇంకా పంటలు బాగా పండుతాయి అనుకున్నాడు. సంఘములో తనకు ఇవ్వబడిన పొలము అంతా ఒక్కచోట లేదు. అందువలన పదిమైళ్ళు

తిరగాల్సివస్తుంది. తను పండించిన పంటను ఇంటికి చేర్చుకోవాలంటే పదిమైళ్ళు కష్టపడాలి. ఈ విధంగా మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. తను వ్యవసాయము చేసి సంపాదించాలంటే పొలాలు కౌలుకు తీసుకొని కౌలు చెల్లించాలి. అలా కాకుండా తనకే ఇంకా ఎక్కువ పొలం ఉంటే కౌలు బాధ తప్పుతుంది కదా అనుకున్నాడు. పామ్ ఏదైనా చవకలో కొనగలిగిన సారవంతమైన భూమికోసం వెదకసాగాడు. ఓ రైతు కష్టాల్లో ఉండి పదమూడు వందల ఎకరాలు అమ్ముతాడని తెలిసి అక్కడికి వెళ్ళాడు. పదిహేను వందల రూబెల్సుకు బేరం జరిగింది. సగం డబ్బు చెల్లించి సగం అప్పుక్రింద వ్రాసి ఇచ్చేటట్లు మాట్లాడుకున్నాడు.

ఈ విషయం ఇలా ఉంటే ఓ సాయంకాలం ఓ బాటసారి ఒకరు పామ్ ఇంటి వద్ద ఆగి తన గుఱ్ఱానికి నీరు పెట్టాడు. పామ్ అతనికి టీ కూడా ఇచ్చాడు. వాళ్ళు కొంచెంసేపు మాట్లాడుకొనిన తర్వాత ఆ బాటసారి "నేను ఇప్పుడు – భాష్కిర్ నుండి వస్తున్నాను, పదమూడువేల ఎకరాల భూమిని వెయ్యి రూబుల్సుకు మాత్రం కొన్నాను" అన్నాడు.

"అదెట్లా కుదురుతుంది?" అన్నాడు పామ్.

"నిమనము అక్కడ భాష్కిర్‌లో సర్కారు పెద్దలతో స్నేహంగా ఉంటే చాలు. నేను ఒక డబ్బా టీపొడి, కొన్ని క్రొత్త దుస్తులు వారికి బహుమానంగా ఇచ్చాను. వారు నాకు పొలం ఇచ్చారు. ఆ పొలం కూడా నదీతీరాన ఉన్నది. నువ్వు ఒక సంవత్సరమంతా నడిచి చూచినా తరగని పొలం అక్కడ ఉన్నది" అన్నాడు బాటసారి.

అప్పుడు పామ్ ఇక్కడ ఇంత డబ్బు పెట్టి పొలం కొనేకంటే భాష్కిర్‌లోకి వెళ్ళి వేలకొలది ఎకరాల పొలం సంపాదించుకోవచ్చని అనుకున్నాడు.

ఆ బాటసారి వెళ్ళిపోయిన తర్వాత పామ్ అతను చెప్పిన ప్రదేశముకు ఎలా ప్రయాణం చెయ్యాలో తెలుసుకున్నాడు. ఒకరోజు తన ముఖ్యమైన పనివానిని వెంట బెట్టుకుని ప్రయాణం సాగించాడు. దారిలో ఓ పట్టణంలో భాష్కిర్‌లోని పెద్దలకొరకు టీపొడి, బ్రాంది, విస్కీ, ఇంకా అనేకమైన బహుమానాలు కొన్నాడు. ఏడురోజులు ప్రయాణం చేసిన తర్వాత ఓ నది ప్రక్కన అనేకమైన గుడారములలో నివశిస్తున్న భాష్కిర్ ప్రజలను కలుసుకున్నాడు. అక్కడ ప్రజలందరూ బలంగాను, సంతోషం గాను కనిపించారు. వారు ఆహారం కొరకు ఎటువంటి పంటలూ పండించడంలేదు. ఆవులు, దూడలు, ఎద్దులు, మేకలు, గొఱ్ఱెల సంపద కలిగివున్నారు. పాలు త్రాగడం, సహజ సిద్ధమైన పండ్లను తినడం, వెన్న కూర్చుకోవడం, పశువుల మాంసము తింటూ వారి వాయిద్యములతో పాడుకుంటూ ఉన్నారు. వారికి ఇతర దేశాల సంగతి తెలియదు. ఇతర జాతులు మనుష్యులు వారికి తెలియదు.

పామ్‌ను చూసి ఆ ప్రజలంతా సంతోషించారు. వారు నివశించే మంచి గుడారములలో ఒకదానిలో మంచి పరుపులు దిండ్లు అమర్చిన చోట పామ్‌కు బస ఇచ్చారు. వారిని గురించి, వారి పిల్లలను గురించి గొప్పగా చెప్పారు. పామ్ మాటలను ఒక ద్విభాషి అనువదిస్తూ ఉన్నాడు.

"మీరు ఇక్కడికి రావడం మాకెంతో సంతోషం. మీరు మాకు ఇచ్చిన బహుమానములకు ప్రతిగా మేము మీకేమి చెయ్యగలము?" అని వారన్నారు.

"ఇక్కడ ఈ సారవంతమైన భూమి నాకు నచ్చింది. మా ప్రాంతములో పొలాలు సారవంతము లేనివైపోయాయి" అన్నాడు.

అప్పుడు వారంతా సంతోషించి, "అలాగే! పొలంలో నీవు చెయ్యి ఎత్తి చూపించినదంతా నీదే" అన్నారు.

తర్వాత ఆ జనం వారిలో వారు దేని విషయమో వాదించు కోవడం మొదలుపెట్టారు. అనువాదికుని చూసి "వారేమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు.

"ఇక్కడ వీరందరికి పెద్ద ఒకాయన ఉన్నాడు. ఆయన కొంచెంసేపట్లో వస్తాడు. ఆయన ద్వారానే నీకు పొలం ఇవ్వబడుతుంది" అన్నాడు ద్విభాషి.

కొంచెంసేపటికి వారి నాయకుడు తలమీద చక్కని టోపీ పెట్టుకొని వచ్చాడు. అప్పుడు పామ్ ఆ నాయకునికి కూడా

కొన్ని బహుమానాలు ఇచ్చాడు. ఆ నాయకుడు సంగతి అంతా తెలుసుకొని సంతోషించి, "మంచిది మీకు ఎంత పొలం కావాలో మీరు తీసుకోండి" అన్నాడు.

అయితే పామ్ "అలాకాదు, నాకు వ్రాత పూర్వకముగా పత్రాలు కావాలి. ఇప్పుడు మీరు మంచిగా ఉచితముగా పొలం ఇస్తారు. తర్వాత కాలంలో వచ్చేవారికి ఈ సంగతులు తెలియవుకదా! మీకు చాలా పొలం ఉన్నది. అది రిజిస్టరు చేయబడితేనే నాది అవుతుంది" అన్నాడు.

"సంతోషం! ఆ విధంగానే పత్రాలు నీకు ఇస్తాము" అన్నాడు. వారి నాయకుడు "మనం పట్నం వెళ్ళి వ్రాత వారితో పత్రాలు వ్రాయించుదాము" అన్నాడు.

"అయితే నేనెంత వెల చెల్లించాలి?" అన్నాడు పామ్.

మాధర – "ఎల్లప్పుడు ఒకటే! ఒకరోజుకు ఒక వెయ్యి రూబుల్లు" అన్నాడు.

"ఒకరోజుకు ఒక వెయ్యా? అదేమి లెక్క? ఎన్ని ఎకరాలు వస్తాయి?" అన్నాడు పామ్.

"మాకు కొలతలు తెలియవు కాని, ఒకరోజులో నువ్వెంత దూరం నడిస్తే దానంతటికి వెయ్యి రూబుల్సు ఇవ్వవలసి ఉంటుంది" అన్నాడు. ''అదే వింటి ఒకరోజులో చాలాదూరం నడిచి చాలాపొలం స్వాధీనం చేసుకోవచ్చు కదా?" అన్నాడు పామ్.

నాయకుడు పెద్దగా నవ్వి "అవును! అదంతా నీదే, కాని ఉదయం నీవు బయలుదేరిన చోటుకు సూర్యుడు అస్తమించే లోపల తిరిగివస్తేనే పొలం అంతా నీదవుతుంది. అలా సూర్యాస్తమయము లోపల నీవు తిరిగి రాలేకపోతే నీవు చెల్లించిన వెయ్యి రూపాయలు కూడా నీవు పోగొట్టుకుంటావు" అన్నాడు.

"కాని నేను బయలుదేరి వెళ్ళి తిరిగి వచ్చిన తర్వాత నేను నడిచిన ప్రదేశమంతా ఎలా గుర్తిస్తాను?" అన్నాడు పామ్.

"మనమంతా ఉదయాన్నే నీవు కోరుకొనిన ప్రదేశమునకు వెళ్తాము. అక్కడ ఒక కర్ర నాటుతాము. నీవు బయలుదేరేదగ్గర నీతో ఓ గడ్డపార తీసుకొని వెళ్తూ ఎక్కడ అవసరము అనుకుంటే అక్కడ ఓ కర్ర పాతిపెట్టు అయితే నీవు సూర్యాస్తమయములోపు వస్తేనే..." అన్నాడు.

పామ్ ఎంతో సంతోషించాడు. వారందరితో కలసి లస్సీ, టీ, మాంసము తిని, తన గుడారములోనికి వెళ్ళి 'రేపంతా నడిచి ఎంత పొలం ఉచితంగా సంపాదించగలను?' అని తెల్లవారేవరకు ఆలోచిస్తూనే తెల్లవారుజామున నిద్రపోయాడు. నిద్రలో ఒక కల వచ్చింది. కలలో పామ్ ఈ గుడారములోనే నిద్రిస్తున్నాడు. గుడారము వెలుపల శబ్దం అయితే బయటకు వచ్చాడు. గుడార ద్వారమునకు ఎదురుగా భాష్కిర్ నాయకుడు కుర్చీమీద కూర్చుని ఉన్నాడు. అతనిని పలుకరించాలని దగ్గరగా వస్తుంటే అతను నాయకుడిగా కాక, తనకు ఈ భాష్కిర్ జనం గురించి తెలియ జెప్పిన బాటసారివలె కనిపించాడు. పామ్ ఆశ్చర్యముతో ఇంకొంచెం ముందుకు వెళ్తే ఆ బాటసారి కాదుగాని, అక్కడ సాతానుడు కూర్చుని ఉన్నాడు. సాతాను కాళ్ళదగ్గర పాంటు చొక్కా వేసుకొని, కాళ్ళకు చెప్పులులేని వ్యక్తి పడివున్నాడు. పామ్ ఆ పడి ఉన్న మనిషిని వివరంగా చూడాలని ముందుకు వస్తే – ఆ పడివున్న వ్యక్తి తనే! చచ్చిపడివున్నాడు.

పామ్ నిద్రమేల్కొని గుడారము వెలుపలికి వచ్చాడు. భాష్కిర్ జనం, వారి నాయకుడు తనకోసం వస్తూ కనిపించారు. వాళ్ళందరు గుఱ్ఱాలు, గుఱ్ఱపు బండ్ల మీద ఎక్కి వచ్చారు. పామ్ కూడా ఓ గుఱ్ఱం ఎక్కి గుడారాలకు తూర్పుగా ప్రయాణం చేసి ఓ కొండ మొదట్లో ఆగాడు.

పామ్ తినడానికి భోజనము, నీళ్ళు, ఓ గడ్డపార తీసుకొని తలమీద టోపీ పెట్టుకున్నాడు. తూర్పు తట్టుగా నడక ప్రారంభించాడు. భాష్కిర్ జనం సంతోషంగా అరుస్తూ అతనిని సాగనంపారు. తొమ్మిది గంటలైన తర్వాత వెనక్కు తిరిగిచూచాడు. కొండమీద జనం చిన్న బొమ్మల్లాగా కనిపించారు.

**(సశేషం)**

చిన్నపిల్లల పేజి

# యజమానుని పుస్తకము




ఒకానొక్కప్పుడు మైఖెల్ అనే ఒక వ్యక్తి ఉండేవాడు. ఆయన ఒక రోజు చాలా సంతోషంగా ఉన్నాడు. ఎందుకంటే అతను కొనుక్కొని పెట్టుకున్న కారు ఈ రోజు ఇంటికి రాబోతుంది. మైఖెల్ ఇంతకముందు ఎప్పుడు కారు కొనుక్కోలేదు కాని కారు వలన అతనికి చాలా ఉపయోగం ఉంది. అతను ఎంతో కష్టపడి డబ్బులు దాచిపెట్టుకొని కారు కొన్నాడు.

ఆ రోజు సమయం దగ్గరకు వచ్చింది. అక్కడ నుండి కారు బయలుదేరింది. మైఖెల్ చాలా సంతోషంగా ఉన్నాడు.

ఇంటికి కారు తెచ్చిన తర్వాత ఆయన మీ కారుని ఇంకేమన్నా మార్చాలా? అని అడిగాడు. వద్దు ఇది చాలు అడిగినందుకు థాంక్స్ అన్నాడు మైఖెల్.

సరే మీకేమైన అవసరం ఉందేమో కారుకి సంబంధిం చిన చిన్న పుస్తకంలో చూసి తెలుసుకోండి అని చెప్పి కారు తాళాలు మైఖెల్ చేతికిచ్చి వెళ్ళిపోయాడు.

ఇంకా మైఖెల్ అక్కడ నుండి పరుగెత్తుకుంటూ కారు దగ్గరకు వెళ్ళాడు. కారు తెరుద్దాం అని కారు తాళాలు తీసి కారు తెరవటానికి ప్రయత్నించాడు కారు తెరుచు కోలేదు. కారు తెచ్చినాయన తెరిస్తే వచ్చి నేను తీస్తే రావటం లేదు ఏంటి! ఇంకా సరే అనుకొని కారు చుట్టు తిరిగి కారు కిటికిలో నుండి లోపలికి చూసి అబ్బా! సీట్స్ ఎంత బాగునాయ్యో అని అనుకున్నాడు. అప్పుడే మైఖెల్ వాళ్ళ స్నేహితుడు స్కోట్ అక్కడికి వచ్చాడు.

కారు బలే ఉంది మైఖెల్ కాని నువ్వు ఎందుకు బయట తిరుగుతూ లోపలికి చూస్తున్నావు.

నా దగ్గరకు ఇప్పుడే కారు వచ్చింది కాని తలుపులు బిగుసుకుపోయాయి తెరుచుకోవటం లేదు.

స్కోట్ నవ్వి తెర్చుకోవటం లేదు. నువ్వు ముందు తలుపులు తెరవటం నేర్చుకున్నావా?

అవును కదా! అని సిగ్గుపడుతు చెప్పాడు మైఖెల్.

మైఖెల్ తాళాలు తలుపు తాళంలో పెట్టి తీయటానికి ఎంతో ప్రయత్నించాడు కాని తెర్చుకోలేదు. జాగ్రత్త మైఖెల్ నువ్వు కారు తాళాలు ఇరుకొనేలాగా చేస్తావు బహుశా అవి కారు డిక్కి తాళాలు అయివుండవచ్చు ఇంకో తాళాలుతో ప్రయత్నించు అన్నాడు స్కోట్. నేను అదే చేద్దామనుకున్నాను అని వెంటనే చెప్పాడు మైఖెల్.

చివరికి కారు డోర్ తెర్చుకుంది. లోపల కూర్చున్నాడు. బాగా ఊపిరి పీల్చి చెప్పాడు బలే ఉంది కదా కారు వాసన.

అవును బాగుంది. సరే రేడియో ఎలా పనిచేస్తుందో చూద్దాం.

చాలాసార్లు ప్రయిత్నించి చివరికి స్కోట్ సలహా తీసుకొని రేడియో పెట్టాడు అయ్యో! ఏంది రేడియో స్టేషన్ తప్పుగా వస్తుంది అలాగే శబ్దం కూడా తక్కువగా ఉంది అని మైఖెల్ ఫిర్యాదు చేశాడు.

అప్పుడు స్కోట్ రేయ్ మోఖెల్ ఆ బటన్స్ సరిగ్గా నొక్కితే కదరా తెలిసేది. అసలుకి నువ్వు కారుకి సంబంధించిన చిన్న పుస్తకం చదివావా లేదా? అసలు నేను కారు కొనగానే ముందు చదివిందే ఆ చిన్న పుస్తకం అన్నాడు స్కోట్.

ఇప్పుడు కాదు స్కోట్ తర్వాత చదువుతాను ముందు ఈ అందమైన కారుని నడపాలి.

అప్పుడు స్కోట్ జాగ్రత్త మైఖెల్ ముందు నీ సీటు బెల్ట్ పెట్టుకో అని హెచ్చరించాడు.

నాకు సహాయం చేయి నేనెల ఈ సీటు బెల్ట్ పెట్టు కుంటాను స్కోట్. అప్పుడు స్కోట్ నడుచుకుంటా వచ్చి సీటు బెల్ట్ పెట్టకోవటంలో మైఖెల్‌కి సహాయం చేసి జాగ్రత్త నువ్వు ఏమి చేస్తున్నావో నీకు తెలుసుగా అని మైఖెల్‌కి జాగ్రత్త చెప్పి ప్రక్కన నుంచోని చూస్తున్నాడు.

కారుని రోడ్డు మీదకి తెచ్చాడు.

మైఖెల్ ఆచర్యపోయాడు ఏంటి కారు వెనక్కి పోతుంది. కొన్ని బటన్స్ నొక్కి చూసాడు అయిన ప్రయోజనం లేదు కారు వెనక్కి పోతూనే ఉంది. స్కోట్ భయపడుతు చూశాడు మైఖెల్ కారుని చెట్టుకి గుద్దేడు. కారు పాడైపోయింది.

స్కోట్ పరుగెత్తుకుంటు మైఖెల్ దగ్గరికి వెళ్ళి నువ్వు ఎందుకు కారుని ఆపలేదు. ఏమో నాకు ఎలా చేయాలో తెలియలేదు అని మైఖెల్ వనుకుతు చెప్పాడు.


మైఖెల్ లాగే ఎంతో మంది దేవుడు మన కిచ్చిన పుస్తకం అంటే బైబిల్ (పరిశుద్ధ గ్రంథం) చదవరు. ఈ బైబిల్ (పరిశుద్ధ గ్రంథం) మనకు ధనము కలుగటానికి అలాగే ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. ఈ పరిశుద్ధ గ్రంథం మనం రోజు చదవటం వల్ల మనకి జ్ఞానము అలాగే మనం ఈ లోకంలో ఎలా జీవించాలో తెలుస్తుంది. చాలా మంది ఈ బైబిల్ (పరిశుద్ధ గ్రంథం) తెలియక బయట వుండి తప్పుడు తాళం తీస్తుంటారు మైఖెల్ లాగా. చాలా మంది రకరకాల తాళాలు తీస్తుంటారు పరలోకం చేరటానికి కాని యేసుప్రభువు మనకేమి చెప్పాడు నేనే మార్గము నా ద్వారనే తప్ప ఎవరు పరలోకం చేరలేరు. కాబట్టి మనం ముందు యేసు ప్రభువుని మన పాపములను క్షమించమని అడగాలి తర్వాత మనం రోజు ప్రార్ధన చేసుకొని బైబిల్ (పరిశుద్ధ గ్రంథం)ని చదవాలి. అప్పుడు మనకి ఎప్పుడు ఏమి చేయాలో తెలుస్తుంది. అప్పుడు మన జీవితం ఆనందంగా ఉంటుంది.

మీరేమి ఆలోచిస్తున్నారు యేసుప్రభువు మన కొరకు ఇచ్చిన బైబిల్ చదివి సరైన దారిలో పోదామనా? లేకపోతే మైఖెల్ లాగా తప్పు దారిలో వెళ్దామనా?

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు "పత్రిక కావాలా? వద్దా?" అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**– ఎడిటర్**



5

# బైబిలు చరిత్ర

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

## ప్రజల జీవన విధానాన్ని అధ్యయనం చేయడం

బైబిలు కాలంలో ప్రజల జీవనవిధానం గురించి కూడ పురావస్తు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. రాజ్యపరి పాలనా పద్ధతుల గురించి ప్రజల వృత్తులు వ్యాపకాల గురించి వారి ఆహారపుటలవాట్ల గురించి వారుపయో గించిన వస్తువుల గురించి భవననిర్మాణ పద్ధతుల గురించి మతసాంప్రదాయాల గురించి నమ్మకాల గురించి భవిష్యత్తు పట్ల వారికున్న ఆశాభానం గురించి కూడ పురావస్తు ఆధారాలు తెలియ జేస్తున్నాయి.

ప్రాచీన కాలంలోని సంస్కృతుల గురించి ఎన్నో వివరాలు వేర్వేరు ఆధారాల ద్వారా లభిస్తాయి. సంతానంలేని ఒక స్త్రీ తన దాసి ద్వారా బిడ్డలను కనమని తన భర్తను అడగవచ్చని హమ్మూరాబి శిక్షాస్మృతి వివరిస్తుంది. తాను గొడ్రాలు కాబట్టి శారా అబ్రాహాంను హాగరు ద్వారా సంతానాన్ని పొందమని అడగడానికి (ఆదికాండము పదహారవ అధ్యాయం) బహుశా ఈ ఆచారమే కారణం అయ్యుండవచ్చు.

మరో ముఖ్యమైన పురావస్తు పరిశోధన నాణేలకు సంబంధించినది. వీటి ప్రస్తావన ఎజ్రా 2:69; నెహెమ్యా 7:70-72లలో కన్పిస్తుంది. స్థానిక పరిపాలనాధికారాలను తెలుసుకోడానికి చారిత్రక కాలాన్ని నిర్ధారించడానికి నాణేల పరిశోధన ఎంతో ఉపయుక్తమైనది.

దంతంతో చేసిన నగిషీపని పూజాప్రతిమలు మట్టి కుండలు ఆభరణాలు అస్థికలు (మనుషుల, పశువుల యెముకలు) బైబిలు కాలంనాటి సంస్కృతుల గురించి తెలుసుకోడానికి దోహదం చేస్తాయి. యేసు కాలంనాటి అస్తిపంజరాలు అప్పటి ప్రజల సరాసరి ఎత్తు ఐదడుగుల పైనేనని తెలియజేస్తున్నాయి. సువార్తల్లో వివరించినట్లుగా నేరస్థుణ్ణి సిలువకు మేకులతో కొట్టేవారని కూడ పురావస్తు ఆధారాలు తెలియజేస్తున్నాయి. పాదంలో మేకు విరిగి వున్న కాలిపిక్క వున్న పురుషుని అస్థిపంజరాన్ని శిథిలాల్లో కను గొన్నారు. సిలువవేయడం గురించి, సిలువవేయబడిన నేరస్థుణ్ణి కాళ్లు విరగగొట్టడం గురించి యోహాను సువార్త తెలియజేయడం విదితమే (యోహాను 19:18,32).

మరి కొన్ని పురావస్తు పరిశోధనలు యేసు కాలంలో రోమన్ల శిల్పకళానైపుణ్యం గురించి భవన నిర్మాణకళ గురించి తెలియ జేస్తాయి. మహా హేరోదు నిర్మించిన దేవాలయపు శిథిలాలు సైతం నేటికీ భద్రంగా వున్నాయి. అలాగే గ్రీకు రోమన్ దేవుళ్ల దేవతల గుళ్ల శిథిలాలను సైతం కనుగొన్నారు. బైబిలు కాలం గురించి తెలుసుకోవాలనుకొనే వారికి యివి ఎన్నో వివరాలు నందిస్తాయి. తొలి క్రైస్తవులు గతంలో యూదు మతాన్ని అవలంబించిన వారేనని, వారిమీద నాటి తత్వసిద్ధాంతాల ప్రభావం కూడ ఉందనేది విస్మరించలేని విషయమని పురావస్తు ఆధారాలు తెలియజేస్తున్నాయి.

### పాత నిబంధన - పరిచయం

పాత నిబంధన (యూదు లేఖనాలు) బైబిల్లో ప్రథమ భాగం. తొలి క్రైస్తవులు ఉదాహరించిన లేఖనాలు కూడ యివే. క్రీస్తు శకం మొదటి రెండు శతాబ్దాల్లో క్రొత్త నిబంధన లోని గ్రంథాలకు లేఖన ప్రతిపత్తి లభించిన తర్వాతనే యూదు లేఖనాలను పాత నిబంధన అనడం ప్రారంభమైంది.

వాస్తవానికి పాత నిబంధన గ్రంథం సుమారు వెయ్యేండ్ల కాలంలో వివిధ వ్యక్తులు వ్రాసిన వివిధ రచనల సంకలనం. పాత నిబంధనలోని కొన్ని రచనలు క్రీ.పూ.1200నాటికి చెందినవి. పాత నిబంధన రచనల్లో కొన్ని వాస్తవానికి తరతరా

లుగా వచ్చిన పారంపర్య గాథలే. ఈ గాథలనే సేకరించి గ్రంథస్థం చేయడం జరిగింది (ఉదా: ఆదికాండము 12-24 అధ్యాయాల్లోని అబ్రహాం వృత్తాంతం). పాత నిబంధనలోని చాలా భాగాన్ని హెబ్రీ భాషలో వ్రాశారు. ఇశ్రాయేలీయుల భాష హెబ్రీ భాష. పాత నిబంధనలోని కొన్ని రచనలను తర్వాత కాలంలో హెబ్రీ భాషకు దగ్గరగా వుండే అరమేయ భాషలో రాశారు.

ఇశ్రాయేలు ప్రజల స్వంత దేవుని గురించి, దేవుడు వారికి నిర్దేశించిన జీవన విధానం గురించి పాత నిబంధన గ్రంథం తెలియజేస్తుంది (లేవీయ 20:7,8). దేవుడైన యెహోవాయే సృష్టికర్త అని (ఆది 1; కీర్తన 104), ఆశీర్వదిస్తానని వాగ్దానం చేసే దేవుడని కూడ పాత నిబంధన తెలియజేస్తుంది. దేవుడు అబ్రహాం మొదలుకొని ఇశ్రాయేలు ప్రజలతో చేసిన నిబంధనలలో ఈ ఆశీర్వాదాలు వున్నాయి. అబ్రాహాం శారాల సంతానం గొప్ప ప్రజ అవుతారని వారొక దేశాన్ని స్వతంత్రించుకుంటారనీ అబ్రాహాం సంతానానికి (ఇశ్రాయేలు ప్రజ) దేవునికి మధ్య నెలకొన్న ప్రత్యేకమైన సంబంధం సర్వలోకానికి ఆశీర్వాదకారణ మౌతుందని దేవుడు అబ్రహాంకు వాగ్దానం చేశాడు (ఆది 12:1-3; 15:5-8,18-20; 17:8). అబ్రహాం అతని సంతానం తమకు దేవునికి మధ్య వున్న నిబంధనకు గుర్తుగా సున్నతి నాచరించాలి (ఆది 17:9-14).

అనేక సంవత్సరాల అనంతరం అబ్రాహాం సంతానాన్ని (ఇశ్రాయేలీయులు) ఐగుప్తు నుంచి వెలుపలికి నడిపించడానికి దేవుడు మోషేకు సహాయం చేశాడు. అయితే, దేవుడు వారికి వాగ్దానం చేసిన దేశం (కనాను) చేరేముందు వారు నలభై సంవత్సరాలు అరణ్యంలో సంచరించారు. ఈ అరణ్య ప్రయాణంలో సీనాయి పర్వతం వద్ద దేవుడు మోషేతో ప్రజలతో నిబంధన చేశాడు. ఈ నిబంధనలో ఆజ్ఞలు ఉపదేశాలు (హెబ్రీ భాషలో తోరా) వున్నాయి. దేవుడైన యెహోవాను ఎలా ఆరాధించాలో దేవుని ప్రజలైన వీరు ఎలా జీవించాలో ఈ ఆజ్ఞలు ఉపదేశాలు బోధిస్తాయి. ప్రజలు ఈ ఆజ్ఞలకు బద్ధులై దేవుని పట్ల విశ్వాస్యత చూపినట్లయితే దేవుడు అబ్రాహాంతో చేసిన వాగ్దానాలన్నీ నెరవేరతాయి. అయితే, వారు ఆజ్ఞలకు బద్దులు కాకపోయినట్లయితే దేశం వారికి దక్కదు; శత్రువులు వారిని శిక్షిస్తారు (ద్వితి 7:6-15). దేవుడు ఏర్పరచుకున్న ప్రజలు ఈ నిబంధనకు బద్ధులై వుండడానికి ఎలా ప్రయాసపడ్డారో వారు అవిధేయులైనప్పుడు దేవుడు వారిని క్షమిస్తూ ఎలా కాపాడుతూ వచ్చాడో పాత నిబంధన వివరిస్తుంది. పాత నిబంధన విశ్వాసం గురించి కూడ తెలియజేస్తుంది. యూదులకు క్రైస్తవులకు యిది పవిత్ర గ్రంథం. వారి జీవితా లకు ఒక అర్ధాన్ని చేకూర్చుతూ వారిని ఒక అధికారానికి బాధ్యులను చేసే గ్రంథమిది. పాత నిబంధనలోని చాలా భాగాలను సంఘారాధనల్లో చదువుతారు, ఆలపిస్తారు కూడ. దేవుని ప్రజలు పరిశుద్ధతతో నైతిక విలువలతో జీవించాలనేది దేవుని అభీష్టమని పాత నిబంధనలోని ఆజ్ఞలు ఉపదేశాలు తెలియజేస్తాయి. సాధారణమైన వ్యక్తులు విశ్వాస విధేయతల విషయంలో మార్గదర్శకులు కావడం గురించి పాత నిబంధన లోని వృత్తాంతాలు తెలియజేయడమేకాక యితరులను విశ్వాసం విధేయతల విషయంలో ప్రేరేపిస్తాయి కూడ. సరైన జీవితం సరైన ఆరాధం ఎంత అవశ్యకమో ప్రవక్తల సందేశాలు నొక్కి చెబుతాయి. దేవుడు బీదలను కటాక్షిస్తాడని అవిధేయు లను క్షమించడానికి సిద్ధమనస్సు చూపుతాడని కూడ ఈ సందేశాలు వక్కాణిస్తాయి. జ్ఞానసాహిత్యం జ్ఞానవివేకాలను బుద్ధికుశలతను కలిగిస్తూ సరైన జీవితం కొరకు సమయోచిత మైన సలహాలనిస్తూ పురాతనకాలం నుంచి ప్రజలకు జవాబు దొరకని జీవితపు జటిల ప్రశ్నలకు సరియైన జవాబుల నివ్వడంలో సహాయ పడుతుంది.

వేర్వేరు సాంప్రదాయాలకు చెందిన బైబిళ్లలో పాత నిబంధన గ్రంథంలోని రచనల సంఖ్య ఒకటిగా వుండదు. అయితే, పాత నిబంధన దేవునికి ఆయన ప్రజలకు మధ్య వున్న ప్రత్యేకమైన సంబంధాన్ని వెల్లడి చేస్తూ క్రొత్త నిబందన సందేశాన్ని అర్థం చేసుకోడానికి పూర్వరంగంగా నిలుస్తుందన్న దనేది అందరూ అంగీకరించే విషయం.

## ఆదికాండము పరిచయం

అది అనే పదానికి 'మూలం', లేక 'మొదలు' అని అర్థం. ఈ పుస్తకం విశ్వసృష్టి గురించి మానవజాతి ఆరంభం గురించి లోకంలో పాపం శ్రమ మొదలు కావడం గురించి వివరిస్తోంది. ఇంకా ఈ పుస్తకం దేవుడు మానవులతో ఎలా ప్రవర్తించాడో వివరిస్తోంది.

**విషయసూచిక**

విశ్వం, మరియు మానవుడు-సృష్టి వృత్తాంతం 1:1-2:25
పాపం, మరియు శ్రమ - ఆరంభం 3:1-24
ఆదాము నుంచి నోవహు వరకు 4:1-5:32
నోవహు, మరియు జలప్రళయం 6:1-10:32
బాబెలు గోపురం 11:1-9
షేము నుంచి అబ్రాము వరకు 11:10-32
పితరులు: అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబు 12:1-35:29. ఏశావు వంశస్థులు 36:1-43
యోసేపు, మరియు అతని అన్నదమ్ములు 37:1-45:28
ఐగుప్తులో ఇశ్రాయేలీయులు 46:1-50:26

## నిర్గమకాండము పరిచయం

'బయలుదేరడం' అనే అర్థాన్నిచ్చే ఈ పుస్తకం ఇశ్రాయేలు చరిత్రలోని ప్రముఖ సంఘటనలను తెలియజేస్తోంది. ఆ సంఘటనలు: ఐగుప్తులో దాసులుగా ఉన్న హెబ్రీయులు అక్కడనుంచి బయలుదేరడం, సీనాయి పర్వతానికి ప్రయాణం, మరియు దేవుడు తన ప్రజతో చేసిన నిబంధన.

**విషయసూచిక**

ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి విడుదల పొందడం 1:1-15:21

(ఎ) ఐగుప్తులో బానిసలు 1:1-22
(బి) మోషే పుట్టుక, మరియు తొలి జీవితం 2:1-4:31
(సి) మోషే మరియు అహరోను ఐగుప్తు రాజు యెదుటకు వెళ్లడం 5:1-11:10
(డి) పస్కా, మరియు ఐగుప్తునుంచి బయలుదేరడం 12:1-15:21

ఎర్ర సముద్రంనుండి సీనాయి పర్వతం వరకు 15:22-18:27
ధర్మశాస్త్రం, మరియు నిబంధన 19:1-24:18
సాక్ష్యపు గుడారం, మరియు ఆరాధన నియమాలు 25:1-40:38

## లేవీయకాండము పరిచయం

ఈ పుస్తకం పురాతన కాలంలో ఇశ్రాయేలీయులు ఆచరించిన ఆరాధన నియమాల గురించి మతపరమై పండుగల గురించి మరియు వీటిని నిర్వహించవలసిన యాజకుల విధుల గురించి వివరిస్తోంది.

**విషయసూచిక**

బలులు, మరియు అర్పణలు - నియమాలు 1:1-7:38
అహరోను, మరియు అతని కుమారులను యాజకులుగా ప్రతిష్ఠించడం 8:1-10:20
పవిత్రమైనవాటి గురించి మరియు అపవిత్రమైనవాటి గురించి ఆజ్ఞలు 11:1-15:33
ప్రాయశ్చిత్త దినం 16:1-34
దైనందిన జీవితంలోను మరియు ఆరాధనలోను పరిశుద్ధత గురించి ఆజ్ఞలు 17:1-27:34

## సంఖ్యాకాండము పరిచయం

సంఖ్యాకాండము ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతాన్ని విడిచిపెట్టిననాటినుండి దేవుడు వారికి వాగ్దానం చేసిన దేశపు తూర్పు సరిహద్దు సమీపించేనాటి వరకు గడిపిన నలభై సంవత్సరాల చరిత్రను వివరిస్తోంది. సంఖ్యాకాండం అనే పేరు ప్రాముఖ్యంగా ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతాన్ని విడిచి పెట్టేముందు, మళ్లీ ఒక తరం గడిచిన తర్వాత యొర్దాను తూర్పున మోయాబు మైదానంలో మోషే ఇశ్రాయేలీయుల సంఖ్యను లెక్కించడాన్ని సూచిస్తోంది.

**విషయసూచిక**

ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతాన్ని విడిచిపెట్టడానికి సిద్ధపడడం 1:1-9:23

(ఎ) మొదటి ప్రజాసంఖ్య 1:1-4:49
(బి) ఇతర ఆజ్ఞలు, మరియు కట్టడలు 5:1-8:26
(సి) రెండవ పస్కా 9:1-23

సీనాయి పర్వతంనుండి మోయాబు వరకు 10:1-21:35
మోయాబులో జరిగిన సంఘటనలు 22:1-32:42
ఐగుప్తునుండి మోయాబు వరకు జరిగిన ప్రయాణపు సంక్షిప్త వర్ణన 33:1-49
యొర్దాను దాటడానికి ముందు ఇచ్చిన సూచనలు 33:50-36:13

**(సశేషం)**

# సాక్ష్యము

నాపేరు రాజమణి నేను చిన్నతనంలో మిషనెరీ హాస్టల్లో ఉండి చదువుకోవడం వలన నాకు ప్రార్థించడం, బైబిలు చదవడం, పాటలు పాడటం బాగా వచ్చు. మా హాస్టల్‌లో సండేస్కూల్ ప్రోగ్రామ్స్ బాగా జరుగుతూ ఉండవి. పదవ తరగతి అయిపోయిన తర్వాత మా స్వగ్రామమైన పాలకొల్లు వెళ్ళాను.

మా తల్లిదండ్రులు క్రైస్తవులే కాని దేవునితో సహవాసం చాలా తక్కువ. గనుక నేను కూడా దేవుని మరచిపోయాను. నా వివాహం అయిన తరువాత నా భర్త ప్రభుత్వ ఉద్యోగి గనుక ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో కాపురమున్నాము. నేను కూడా స్కూలు టీచర్‌గా పనిచేసేదానను. ఇరుగుపొరుగు వారు హిందువులు గనుక నేను కూడా వారి పూజలలో పాల్గొనడం ప్రసాదం తినడం మొదలు పెట్టాను.

తరువాత కొందరితో భరించరాని సమస్యలు ఎదురైనవి. చర్చికి ఎప్పుడైనా వెళ్తుండే వారము. దేవునిపై నమ్మకమున్నా కాని ఆయన శక్తిని ఆశ్రయించలేకపోయాను. మా దగ్గర వాళ్ళతో నాకు భరించలేని సమస్యలు ఎదురైనవి. ఆ పరిస్థితులలో నేను ఆత్మహత్య ప్రయత్నం వరకు వెళ్ళాను. అప్పుడు ఒక స్త్రీ నా బాధ చూచి మీరు క్రైస్తవులు కదా మీరు వెళ్ళి బైబిలు చదవండి మీకు నెమ్మది కలుగుతుంది అని చెప్పింది.

నేను వెంటనే ఇంటికి వెళ్ళి బైబిల్ తీసిన వెంటనే “నిన్ను అవమానించిన వారిని అణగద్రొక్కెదను” అనే వాక్యము వచ్చింది. ఆ వాక్యం ద్వారా దేవుడు నాతో మాట్లాడి నన్ను ఆదరించాడు. తరువాత మేము ఇల్లు మారాము. మా ఇంటి దగ్గర్లోనే హోలీబెల్స్ సండేస్కూలు ఉంది. అక్కడికి మా ఇద్దరు పిల్లలు వెళ్ళేవారు. వారి ద్వారా ఆ సండేస్కూల్ టీచర్ పరిచయమైనది. ఆమె వద్దకు వెళ్ళి రోజూ వాక్యం చెప్పించుకొని ప్రార్థన చేసుకొనేవారము.

మానసిక ఆందోళన వల్ల కంటిలో మచ్చ వచ్చింది. ఆపరేషన్ చేశారు, అయినా కూడా కన్నువాపు వచ్చింది. డాక్టర్ చూసి కంటి విషయం చాలా జాగ్రత్తగా ఉండాలి ఎక్కువగా ఆలోచించవద్దు అని చెప్పారు. నా భర్త తప్ప నాకు ఎవరూ దిక్కులేరు. కన్నుపోతే ఆయన నన్ను ఆదరిస్తారో, లేదో అని చాలా బాధపడ్డాను.

ఆ రోజు రాత్రి యేసయ్య నా కలలో తల దగ్గర కూర్చుని నా కన్నుపై చెయ్యి వేసి నీ కన్నుకు ఏమీ ప్రమాదం లేదు, తగ్గిపోతుంది అని మూడు సెలైన్ బాటిల్స్ ఇచ్చి, ఇంట్లో ఉంచుకో, నీవు బలహీనంగా ఉన్నావు అన్నారు.

ఆ తరువాత నేను హాస్పిటల్‌కు వెళ్ళినపుడు డాక్టర్ నా కన్ను చూసి ఆశ్చర్యపోయి నీ కన్ను ఆపరేషన్ చేసిన కన్నులాగా లేదు. అది మామూలు ఆరోగ్యవంతమైన కన్నులాగా ఉంది. గ్లాసెస్ కూడా అవసరం లేదు అన్నాడు. నా దేవుడే నా కన్ను ముట్టి బాగుచేశాడు అని నేను సంతోషించాను. అప్పటి నుండి ఎక్కువ సమయం దేవుని సహవాసంతో గడుపుతున్నాను. హోలీబెల్స్ సండేస్కూలు బ్రాంచి మియాపూర్‌లో ప్రారంభించి చిన్నబిడ్డల పరిచర్య చేస్తున్నాను.

నా ఈ చిన్ని పరిచర్య కొరకు మా కుటుంబము కొరకు ప్రార్థించండి. దేవుడు నా జీవితంలో ఎన్నో అద్భుతములు చేసి సమస్యలన్ని తీర్చి ఆయన మార్గంలో నడిపిస్తున్నందుకు దేవుని ఘన నామమునకు స్తోత్రములు చెల్లిస్తున్నాను.

**మీరు ఒక గొప్ప సాక్ష్యము కలిగి ఉండవచ్చు. మీ సాక్ష్యము ద్వారా కొంతమంది మారవచ్చును లేదా విశ్వాసములో బలపడవచ్చు. అటువంటి గొప్ప సాక్ష్యములు మాకు పంపించండి. మేము వాటిని ప్రచురిస్తాము.**

4

# మధ్యకాలము

## (ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)



బ్రదర్ కె.సామ్రాట్

తిమోతియస్, బక్కిదెస్ అను వారిద్దరు అంతియోకస్ ఆధ్వర్యంలో గవర్నర్లుగా ఉండిరి. ఈ సమయంలో వారు జార్జియాస్ సహాయమునకై వెళ్ళి యూదా బలప్రభావము వలన బలైపోయిరి. యూదా శత్రుసైన్యము నుండి బలమైన మంచి యోధులను కొనిపోయి యుద్ధమునకు వాడుకొనెను. పాడైపోయిన వారి వస్తువులను దోచుకొని పోయెను. ఈ ఓటమి యూఫ్రటీసు నది ప్రక్కనున్న దేశమంతటికి గవర్నరైన లిసియాన్‌ను కూడా వెంబడించెను. యెరూషలేముకు 20 మైళ్ళ దూరములో ఉన్న బెత్‌జూరా దుర్గము వరకు చొచ్చుకొని పోయెను. అతడు తన అరవై వేల కాల్బలము ఐదువేల గుర్రములతో దేశమును నాశనం చేస్తానని భయపెట్టెను కాని అతడు యూదా అతని అనుచరులైన పదివేలమంది పురుషులచేత ఊరకనే ఓడిపోయెను.

ఈ విజయము యూదాకు కొంత గౌరవము చేకూర్చెను. మరియు అతడు దేవాలయమును, నిజదేవుని ఆరాధించుటకే తిరిగి సమకూర్చి, అందరిని తొలగించి మలచబడని రాళ్ళతో బలిపీఠమును కట్టి, యుద్ధమందు అంతియోకస్ దోచుకొని పోయిన బంగారు సామాగ్రిని, పాడైపోయిన ఇతర సామాగ్రి అంతటిని తిరిగి చేర్చెను. ఆ విధంగా యూదా ఆలయమును తిరిగి ప్రతిష్టించెను. మరియు ఆలయ ప్రతిష్టిత విందును ప్రతి సంవత్సరము ఆచరించునట్లు ఇంకెప్పటికి అతని జ్ఞాపకార్ధముగా దాదాపు జ్ఞాపకార్ధ ఉత్సవము జరిగెను.

ఆక్రా పర్వతము మీద ఉన్న దుర్గమును వశపరచుకొనుట అతని ఆశయమైయుండెను. అపోల్లోనియస్ ఆలయము నిలువబెట్టుటకు ఆజ్ఞ ఇచ్చెనుగాని ఇంకా అది అన్యుల ఆధీనములో ఉన్నందున వారు ఆరాధించుటకు వెళ్ళు యూదులపై కోపగించుకొనిరి. గోడను కట్టుటకు ఎక్కువ మంది పురుషులు లేనందున ఆ పని ఆపి మరొక దుర్గమును ఆలయమున్న కొండపై కట్టెను.

ఈ తిరుగుబాటు మరియు యూదుల యొక్క విజయము అంతియోకస్‌కు తెలుపబడినప్పుడు అతడు తన పర్షియా సాహసయాత్రలో యెరూషలేమును నాశనం చేసి ప్రజలంద రికి సమానమైన సమాధుల స్థలముగా మార్చుతా నని భయపెట్టెను. కాని తక్షణమే దేవుడు అతనిని పెద్ద రణములతో మొత్తెను. అతడు ప్రేవులలో భయంకరమైన బాధననుభవిం చెను. అతని హృదయమంతా భయంకరమైన ఆలోచనల తోను, దురాత్మలతోను నిండియుండెను. అతడు తన క్రూరత్వ మునకు నపుంసకులను బాధించినందులకు అది దేవుని యొక్క శిక్ష అని ఒప్పుకొనెను. తను వ్యాధినుండి స్వస్థత నొందితే దేవుని కొరకు మంచిపనులు చేయుదునని వాగ్దాన ములు చేసెను కాని దేవుడు అతని మనవి అంగీకరిం చలేదు. అందువలన అతని శరీరము ఆ కుదరని వ్యాధి వలన సగము క్రుళ్ళిపోయి మరణించెను.

యూదా మక్కబియన్ ప్రభుత్వమును సుస్థిరపరచుటకు నిశ్చయించుకొని మస్పలో జరిగిన సాధారణ కూడికలో ఒక పూర్వకాలపు చట్టమును తీసికొని వెయ్యిమంది ప్రజలకు, వందమంది ప్రజలకు, ఏభైమంది ప్రజలకు, పదిమంది ప్రజలకు ఒక్కొక్క అధికారిని నియమించెను. సన్‌హెడ్రిన్ యొక్క ప్రధాన న్యాయస్థానము యొక్క రాజనీతి విధానమును కూడా అతడే వ్రాసెను. అందులో ప్రతినిధి, ఉపప్రతినిధి మిగిలిన సభ్యులు లేక సెనెటర్స్, పండితులు, న్యాయ శాస్త్రములో జ్ఞానము కలిగినవారు, యాజకులు, సామాన్యులు ఒక గొప్ప ఆలోచన సభగా ఉండి, ఆస్మోనియన్ రాజుల యొక్క అధికారములో శక్తిగల్గిన సభగా తయారై మన

రక్షకుడైన యేసుక్రీస్తు బోధించు దినములలో ఈ సెనెట్ గొప్ప అధికారముతో ఉండెను.

యూదాచే అవమానించబడి తొలగించబడిన లిసియాస్, అంతియోకస్ కుమారుడైన అంతియోకస్ యుపేటర్ అను 9 సం॥రాల బాలుని సంరక్షణలో ఉండి అతనిని సింహాసన మెక్కించి ప్రభుత్వమును ముట్టడి వేసి వెంటనే పొరుగువారైన యిదుమేనీయులతోను ఇతర దేశపు శత్రువులతోను, యూదా దేశముతోను కలిపి ఇశ్రాయేలీయుల వంశమును పూర్తిగా నశింప చేయుటకు ప్రయత్నించెను

ఈ రహస్యపు దురాలోచన అందచేయబడినప్పుడు వారి ఉద్దేశ్యములు అరికట్టుటకు యిదుమీయలోనే యుద్ధము చేయపూనుకొనెను. ఆ విధముగా అక్రాబిటినే యూదయ యొక్క ఒక భాగము ద్వారా మృతసముద్రపు పశ్చిమ భాగం వైపుగా వీరి దేశములోనికి ప్రవేశించి వారిలో 20,000 వేలమందిని హతమార్చెను. యిదూమీయుల మరొక గోత్రమైన బీను ప్రజల మీదపడి మరొక 20,000 మందిని హతము చేసి వారి సైన్యమంతా నాశనం చేసి వారి కోటను స్వాదీనపరచుకొనెను. యోర్దాను దాటుతూ అమ్మోనీయుల ప్రాంతములో అడుగుపెట్టి అనేక విధాలుగా వారిని ఓడించి వారిని ఎక్కువ సంఖ్యలో హతమార్చెను. గిలాదు పర్వతము యొక్క అడుగుభాగమున జాజాను నది ఒడ్డున ఉన్న పట్టణమును స్వాధీనపరచుకొనెను. ఆ విధముగా తిరిగి ఇంటికి వెళ్ళెను.

అతడు తిరిగి యూదయ ప్రవేశించగానే తిమోతియస్ అను ఆ ప్రాంతపు గవర్నరు ఒకడు గొప్ప సైన్యముతో అతనిని వెంబడించెదనని నటించెను. కాని యూదా అతనిపై పడి అతనిని కత్తితో కోయుచు ఎఫ్రాయీము గోత్రములో నున్న గజారా పట్టణం వరకు అతనిని తరిమెను. తిమోతియస్, కెరియస్ అనువారిని ఫేనిస్ను సిరియా సైన్యపు పెద్ద అధికారిని హతమార్చెను.

ఈ విషయము గిలాదు చుట్టూ ఉన్న అన్యదేశపు ప్రజల కుట్రకు కారణమాయెను. తోబు మాసమందు మొదటి దినమున యూదులపైబడి ఒక వెయ్యిమందిని చంపి వారి సామాగ్రిని తీసికొని వారి భార్యాపిల్లలను చెరగొని పోయిరి. మిగిలిన కొద్దిమంది గిలాదులోని "దెమెటా" అను గొప్ప దుర్గములోనికి పారిపోయిరి. తూరు సీదోనియులు టోలమీయస్ ద్వారా గలలియలోనున్న యూదులనందరిని చంపుటకై కుట్రచేయుచుండగా గజరా వద్ద చంపబడిన తిమోతియస్ కుమారుడు గొప్ప సైన్యముతో వారిని ముట్టడి వేసెను. యూదా ఈ క్లిష్టపరిస్థితిలో సన్హెడ్రిన్ సభ యొక్క ఆలోచన ద్వారా సైన్యమును మూడు భాగములుగా చేసి అతను 8000 మంది పురుషులతో అతని సోదరుడైన యోనాతాను 3000 మంది పురుషులతో గలిలయలోనికి నడుచుచూ వెళ్ళిరి. అతని సోదరుడైన యోసేపు యెరూషలేమును, చుట్టూ ఉన్న దేశమును కాపాడుటకు యూదా సీమోనులు తిరిగి వచ్చు వరకు ఉంచబడెను.

వారు గిలాదుకు వెళ్ళుచుండగా ఎదోమీయుల పట్టణమైన బాస్కోరాన్ను ఎదుర్కొని వానిలోని పురుషుల నందరిని చంపి దానిని దోచుకొనిరి. దెతీమా పట్టణమును వశపరచుకొని బందీలుగా ఉన్న అనేకమంది యూదులను విడుదలచేసి ఆ పట్టణమును కాల్చివేసిరి. వారు రాత్రివేళ నడుచుచు దెతీమా పట్టణము ముందుకు రాగా సోదరు లందరు గొప్ప హింసాకాండతో తిమోతియస్ పైబడి అతని సైన్యము పారిపోవునట్లు చేసెను. మరియు 8000 మందిని వెంటాడి చంపిరి. వారు తిరిగి ఎక్కడెక్కడ యూదులు చెరపట్టబడి, బలత్కారము చేయబడుట చూచెనో బాస్కరాన్లో జరిగించినట్లు వారందరిని విడుదల చేసెను.

అదే సమయంలో సీమోను అనేక పర్యాయములు గలలియలోని శత్రువులనందరిని ఓడించి దేశము నుండి పారద్రోలెను. కాని యోసేపు, ఆజ్ఞలకు వ్యతిరేకముగా యెరూషలేమును విడచి సిరియా గవర్నరైన గార్గియాస్ దగ్గరకు పోయి మధ్యధరా సముద్రము యొక్క రేవు పట్టణమైన జామ్నియా మీదకు చెడు హృదయముతో దండయాత్ర చేయుట వలన రెండువేల మంది పురుషులను కోల్పోయెను.

లిసియాస్ ఈ సమయంలో ఎనిమిది లక్షలమంది జనములను, ఎనభై ఏనుగులను రాజ్యములో ఉన్న గుర్రము లన్నింటిని పోగుచేసి వ్యక్తిగతముగా ఆ హెబ్రీ జయశాలి మీదకు దండయాత్ర చేసెను. యూదా బెత్జునాను ముట్టడి

వేయునప్పుడు అతనిని పట్టుకొని 11,000 వేలమంది మనుష్యులను, 16 వందల గుర్రములను చంపి మిగిలిన వారిని పారిపోవునట్లు చేసెను.

ఈ విజయము యూదా మరియు లిసియాస్ మధ్య ఆ యువరాజు పేరిట సమాధానము చేకూర్చెను. దీనివలన ఎపిఫనేస్ ద్వారా అన్యులతో సమానము చేయబడిన చట్టమును త్రోసివేసి యూదులు వారి మతసంబంధమైన చట్టప్రకారమే జీవించునట్లు అనుమతించెను.

ఏమైనా ఈ సమాధానము అతి త్వరలోనే యొప్పే జామ్నియా ప్రజల ద్వారా పడగొట్టబడెను. వారు యూదులను క్రూరంగా హింసించి చంపిరని యూదాకు తెలిసిన వెంటనే రాత్రి సమయమందు వారి రేవు మీద పడి వారి నౌకలన్నింటిని కాల్చివేసెను. మరియు మంటలు తప్పించుకొనిన వారిని కత్తితో చంపెను. తర్వాత జామ్నియా ఓడరేవును కాల్చివేసి అందులోని నౌకలన్నింటిని తగులబెట్టెను.

తిమోతియస్‌కు కూడా ఈ జయశాలి నుండి పారిపోయి అసమాధానములో ఉండి ఒక లక్షాఇరవైవేల మంది సైన్యమును, రెండువేల ఐదువందల గుర్రములను సమకూర్చి గిలాదులోనున్న యూదులను హతమార్చుటకై బయలుదేరెను. కాని ఈ వార్త యూదాకు తెలిసిన వెంటనే అతని మీదకు యుద్ధమునకు బయలుదేరెను.


తరువాత యూదా తిరుగులాడుచున్న అరబ్బులలో అనేకమందిని ఓడించి వారితో సంధిచేసుకొనెను. రూబేను గోత్రములోనున్న కాస్పిన్ అను హెస్బాను పట్టణమును తీసికొని అందులో నివసించేవారిని కత్తితో హతము చేసి ఆ స్థలమును నాశనము చేసి కరాసా పట్టణమును కూడ పట్టుకొని అందున్న కోటలోని 10,000 మందిని కత్తితో హతముచేసెను. అతడు తిమోతియస్‌తో కలసివచ్చి అతనితో యుద్ధము చేసి అతని ప్రజలలో 30 వేలమందిని హతము చేసి అతనిని బంధించి మిగిలిన సైన్యమును అరేబియాలో నున్న కార్నియోన్ పట్టణము వరకు వెంటాడి ఆ పట్టణమును కూడా తీసికొని తిమోతియస్ సైన్యములో నుండి 25 వేలమందిని హతమార్చెను. కాని అతని పరిపాలన ప్రాంతంలో ఉన్న యూదులందరిని విడుదల చేయుదునన్న వాగ్దానముతో తిమోతియస్‌ను ప్రాణముతో విడిచి స్వతంత్రునిగా చేసెను.

అతడు యెరూషలేమునకు తిరిగి వచ్చుచు లిసియాస్ ద్వారా యుద్ధసైన్యముతో నింపబడిన ఎఫ్రాన్ అను బలమైన పట్టణమును ధ్వంసము చేసెను. 25 వేలమందిని హతమార్చి దానిని కొల్లపెట్టి నేలపాటు చేసెను. ఎందుకనగా ఆ పట్టణ ముగుండా అతడు వెళ్ళుటకు వారు నిరాకరించిరి. ఈ దండయాత్ర యెరూషలేము ఆలయమందు కృతజ్ఞతారాధనతో ముగింపబడెను.

ఆ విధముగా యూదా తన విరోధుల వలన శాంతిని కోల్పోయి ఇదూమియా దక్షిణ భాగము వరకు యుద్ధములు కొనసాగించెను. ఆ ప్రాంతమునకు దగ్గరగానున్న ముఖ్య పట్టణమైన హెబ్రోనును ధ్వంసము చేసెను. ఆ తర్వాత ఫిలిష్తీయుల ప్రాంతమునకు వచ్చి అష్టోర్ అను పట్టణమును పట్టుకొని వారి విగ్రహములను నాశనము చేసి వారి దేశ మును దోచుకొనెను. తర్వాత సిరియారాజు ఆధీనములోనున్న ఆక్రా కోటలోని సైనికులు యుద్ధకాల మందు ఆలయమును కాపాడిన వారికి సమస్యగా యుండిరి గనుక వారిని చంపుటకై తిరిగి యూదయకు వచ్చెను.

యూదా క్రమముగా ముట్టడి వేయుటకు సిద్ధపడెను. అంతియోకస్ ఆ ఆక్రా పట్టణము నాశనము చేయబడుటను గూర్చి తెలిసికొని దానిని రక్షించుటకై లక్ష కాల్బలముతోను, 20వేల గుర్రములతోను, 32 ఏనుగులతోను, 300 యుద్ధాయుధములు కల్గిన రథములతోను బయలుదేరి ఇదూమియగుండా వెళ్ళుచూ బెత్‌జురా ప్రాంతమును ముట్టడివేసి చివరకు లోపరచుకొనెను. ఆ తర్వాత యూదా ఆ పట్టణమును విడిపించుటకై రాత్రివేళ ఆశ్చర్యరీతిలో 4000 మంది శత్రువులను చంపెను. ఆ యుద్ధములో యూదా తన తమ్ముడైన ఎలియాజరును కోల్పోయెను. మరియు అతడు ఏనుగుతో పొడవబడి మరణమగునట్లు త్రొక్కబడెను. గనుక యూదా తన స్నేహితుల బలవంతం మీద విశ్రాంతి తీసుకోవలసి వచ్చెను.

**(సశేషం)**




# మర్మములు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాబి వందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన మిషనరీ మర్మములు గూర్చి తెలుసుకుందాము.

ఉపోద్ఘాతము: పరిశుద్ధ గ్రంథములోని మర్మము అనగా గోప్యముగా నుంచబడిన గతించిన సత్యము పాత నిబంధన గ్రంథములో తెలియజేయబడియు బయలు పరచబడక, క్రొత్త నిబంధన గ్రంథములో విశదపరచబడియుండెను.

1. పరలోకరాజ్యమర్మము (మత్తయి 13:3-50; మార్కు 4:1-25; లూకా 8:4-15) వాక్యమనే విత్తనములు విత్తేకాలముతో ఆరంభమై, కోతకాలములో ముగియనున్న మన ప్రభువైన యేసుక్రీస్తు వ్యక్తిగత పరిచర్యను ఈ వచనములు వివరించుచున్నవి. ఫలితముగా క్రైస్తవులుగా చెప్పుకొని గోదుమ మొక్కలలో గురుగాంనే కలువుమొక్కలు మంచి చేపలలో పనికిరాని చేపలు బయల్పడినవి. ఇదే క్రైస్తవ లోక తార్కాణము. ఎనిమిదంతలుగా ఎదిగిన ఈ మర్మమును గమనించగలరు.

అ. విత్తువాడు, విత్తనము, నేల(పొలము) (మత్తయి 13:1-9, 18:-23). ప్రభువైన యేసుక్రీస్తుయొక్క ఉద్దేశ్యము, ఆయన పద్ధతులు మరియు మానవ హృదయపు సహజ స్థితిని గూర్చి తెలుపుచున్నది.

ఆ. రక్షకుని పొలములో సాతానుడు విత్తిన గురుగులు (మత్తయి 13:24-30, 36-43) దేవుని పనిని సాతానుడు అడ్డగిస్తాడు. కోతకాలమువరకు గోదుమలను, గురుగుల నుండి సంపూర్ణముగా వేరుచేయబడదు.

ఇ. వెదజల్లే సమయమునుండి కోసేవరకు (మత్తయి 4:26-29) పరలోకరాజ్యము అంచెలంచెల ఎదుగుదల కలిగియున్నది.

ఈ. గొప్ప ఆవగింజ (మత్తయి13:31,32; మార్కు 4:30-32; లూకా 13:18,19) పరలోక రాజ్య ఆరంభము బహు అల్పముగా నుండును. కోతకాలము వచ్చువరకు రక్షణ కలిగినవారు మరియు లేనివారు కూడ కలిసియుందురు.

ఉ. వంటరాని పులిసిన పిండి మరియు పరలోక రాజ్యము (మత్తయి 13:33; లూకా 13:20,21) పులిసిన పిండి లోకమును మార్చగలదు అనేది ఇచ్చట బోధకాదు. అయితే అది దానిని ప్రభావితము చేయగలదనేది ప్రాముఖ్యము.

ఊ. పొలములో దాచబడిన ధనమును కనుగొనుట (మత్తయి 13:44) యూదుల శేషజనాంగమును గూర్చి ఇది తెలుపుచున్నది.

ఎ. అమూల్యమైన ముత్యము (మత్తయి 13:45,46) ఇది సంఘమును గూర్చి పరిశుద్ధ గ్రంథమునందు తెలిపిన మొదటి లేఖన భాగమైయుండవచ్చును.

ఏ. సముద్రములో పట్టిన చేపలను ఏరికూర్చుట (మత్తయి 13:47-50) అంత్య తీర్పును సూచించు న్యాయమైన కార్య సమాప్తి)

పరలోక రాజ్యము ఈ విధముగా మర్మములో కూడుకొని యున్నది. క్రైస్తవులుగా చెప్పుకొను వారి గుంపు యొక్క ఈ యుగస్థితే ఇది. అది మంచి మరియు చెడు, గొధుమలు మరియు గురుగులు, మంచి మరియు చెడుచేపలు గుంపులుగా కలిసి పోయిన సభగానున్నది. ఆచారము, అనుమానము, మరియు లౌకికజ్ఞానము అనువాటిలో అవి మలినమై పోయాయి. అయితే అంతమున అందులోనే సూర్యునివలె ప్రకాశించనై యున్న నిజమైన రాజ్యమునకు చెందిన నిజమైన కుమారులను ప్రభువైన క్రీస్తు చూచుచున్నాడు. లోకమనే గొప్ప పొలములో దాచబడిన తన ధనమును కనుగొని తనకొరకు దానిని సిలువ ద్వారా విమోచించు కొనియున్నాడు. ఈ విధముగా ఆయన ఈ పరలోక రాజ్యవిషయములో నమ్మిన ఇశ్రాయేలీయులను మరియు అన్యులలోనుండి

వచ్చిన ఆయన సంఘమును దేహమును మరియు వధువునై యున్న దానికొరకు తన సమస్తమును అమ్మి (2 కొరింథీ 8:9). ఆ పొలమును నిధిని మరియు వెలగల ముత్యమును కొనియున్నాడు.

2. పరలోకమునకు ఎత్తబడే మర్మము (1 కొరింథీ 15:51,52; 1 థెస్స 4:16)

యేసుక్రీస్తు ప్రభువువారు మధ్యాకాశములో ప్రత్యక్షమగు నప్పుడు ఈ లోకములో నిచిలియున్న విశ్వాసులు మరణము చూడకుండా మహిమపరచబడిన దేహములతో పరలోకము నకు మేఘములపై కొనిపోబడెదరు అనే మర్మము ఇక్కడ తెలియజేయబడియున్నది.

3. యూదులలో నుండి మరియు అన్యజనులలో నుండి రక్షించబడినవారి సమూహమనే మర్మముతో కూడిన క్రీస్తు దేహమైన సంఘము (రోమా 16:25, ఎఫెసీ 3:1-11, 6:19; కొలస్స 4:3) అపొస్తలుడైన పౌలు ఈ మర్మమును ఎఫెసీయులకు 3:6 లో వివరించాడు. ఈ మర్మమేదనగా - అన్యజనులు, సువార్త వలన క్రీస్తు యేసునందు యూదులతో పాటు సమాన వారసులును, ఒక శరీరమందలి సాటి అవయవములును వాగ్దానములో పాలివారలునై యున్నారనునదియే.

4. సంఘము యేసుక్రీస్తుయొక్క వధువు అను మర్మము (ఎఫెసీ 5:28-32) భార్యను ప్రేమించు భర్తగా ఇక్కడ క్రీస్తు సంఘమనే తన భార్యను ప్రేమించుచున్నాడు అనునది గొప్ప మర్మము.

5. విశ్వాసుల మధ్య క్రీస్తు నివసించుట అను మర్మము (గలతీ 2:20; కొలస్స 1:26,27) అన్యజనులలోనుండి వచ్చిన వారు రక్షింపబడుట మాత్రమేగాక వారు ఆయన వధువుగా చేయబడి ఆయనే వారిమధ్య నివసించుచున్నాడు.

6. నరరూపు దాల్చిన క్రీస్తు (దేవత్వము) కొలస్స 2:2,9; 1 కొరింథీ 2:7) దేవుని సమస్త జ్ఞానమైయున్న క్రీస్తు దేవుని బుద్ధి జ్ఞాన సర్వసంపదల క్రీస్తు సంపూర్ణ శరీరాకారముతో మన మధ్య నివసించెను. అయినప్పటికి సంపూర్ణ దైవత్వము కలిగియుండెను అను మర్మము.

7. పాపిని పాపమునుండి విమోచించి దేవుని యొద్దకు తెచ్చుటకు క్రీస్తు నిర్వర్తించిన సిలువకార్యముయొక్క మర్మము (1 తిమోతి 3:16) చివరకు నికొదేము ఈ రమ్యమైన మర్మముయొక్క సరళత్వమును అవగాహన చేసికొనెను.

8. పాపమును గూర్చిన మర్మము (మత్తయి 13:33; 2 థెస్స 2:3-12) ఇది క్రింది వాటిని సూచించును

అ. అంత్య క్రీస్తుయొక్క గుర్తింపు : మహాశ్రమల కాలము వరకు తెలియబడకుండుట

ఆ. అంత్య క్రీస్తు ప్రత్యక్షత : వధువు సంఘము పరమున కెత్తబడిన తరువాత

ఇ. అంత్య క్రీస్తు యొక్క కార్యములు: శక్తివంతమైనవి అయితే అవి సంపూర్ణముగా మంచి మార్గమునుండి తప్పించునవి.

ఈ. అంత్యక్రీస్తుయొక్క శక్తికి మూలము : సాతాను "తనకుతానే".

9. ఇశ్రాయేలుయొక్క ప్రస్తుత కాల అంధత్వము (రోమా 11:25) ఈ మర్మము మీరు తెలుసుకొనగోరుచున్నాను. అదేమనగా, అన్యజనుల ప్రదేశము సంపూర్ణమగు వరకు ఇశ్రాయేలునకు కఠిన మనస్సు కొంతమట్టుకు కలిగెను. ఈ కాలము పెంతెకోస్తునుండి సంఘము ఎత్తబడువరకు.

10. ఏడు నక్షత్రముల మర్మము (ప్రకటన 1:20) యేసు ప్రభువు తానే మర్మమును వివరించెను. అనగా నా కుడి చేతిలో నీవు యేసు నక్షత్రములను గూర్చిన మర్మమును ఆ ఏడు సువర్ణ దీపస్తంభముల సంగతియు వ్రాయుము. ఆ ఏడు దీపస్తంభములు ఏడు సంఘములు (ప్రకటన 1:20).

11. వేశ్యయైన మహాబబులోనును గూర్చిన మర్మము (ప్రకటన 17:5,7) ఇక్కడ చెప్పబడిన మర్మము ఎదుగుదలను గూర్చినది (ఆదికాండము 11) తక్కువ స్థానమునకు పదద్రోయబడుట (మత్తయి 23) తుదకు సంభవింపబోవు వేశ్యయైన సాతాను సంఘ పతనము (ప్రకటన 17:16,17).

12. దేవుని మర్మము (ప్రకటన 10:7; 11:15-19) ఇది అని మర్మములలోనెల్ల గంభీరమైనది మరియు సంభ్రమాశ్చర్య ములు కలుగజేయునది ఆ మర్మమేమనగా దేవుడెందుకు ఇంతపాపము. బాధ, దుఃఖము మరియు సాతాను ఉత్సాహ కార్యములు ఇన్ని వేల సంవత్సరములు జరుగుటకు అంగీ కరించాడు? ఎందుకు ఆయన (ఈ గడియవరకు) తెలియ జేసిన ఉద్దేశము ఒకానొక దినమున, అప్పుడు ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును, ఆయన క్రీస్తు రాజ్యము నా యేసు: ఆయన యుగయుగములవరకు ఏలుననెను (ప్రకటన 11:15).



శ్రీమతి రిబ్కా విక్రాంత్

# దర్శనములు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు.

ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన మిషనరీ "స్వప్నములు మరియు దర్శనములను గూర్చి తెలుసుకుందాము.

## దేవుని యొద్ద నుండి స్వప్నములు

1. దేవుడు అబ్రహాముతో చేసిన నిబంధనను ధృడపరచుచు యాకోబు కనిన నిచ్చెన కల. ఆదికాండము 28:12

2. సొలొమోను స్వప్నమందు దేవునియొద్ద నుండి జ్ఞానమును మరియు ఒక హెచ్చరికను పొందెను. 1రాజులు 3:5,9:2

3. క్రొత్త నిబంధనలో గల యోసేపు మూడు స్వప్నముల యందు దేవునియొద్దనుండి మూడు సందేశములను పొందెను.

అ. మరియ కన్యత్వమును (పరిశుద్ధతను) ధృవపరచుచు, ఆమెను విడనాడవద్దని. మత్తయి 1:19,20

ఆ. హేరోదునుండి తప్పించుకొని ఐగుప్తుకు పారిపొమ్మని. మత్తయి 2:13

ఇ. హేరోదు చనిపోయిన తరువాత తిరిగి పాలస్తీనా వెళ్ళుమని. మత్తయి 2:19-22

4. యేసు జన్మించిన తరువాత ఆయనను పూజించి కానుకలు సమర్పించిన జ్ఞానులు తిరిగి హేరోదు నొద్దకు వెళ్ళవద్దని స్వప్నమందు దేవునిచేత ఆజ్ఞాపించబడిరి. మత్తయి 2:12

## దర్శనములు

1. ఒక దర్శనమందు యాకోబుకు ఐగుప్తు వెళ్ళవలసినదిగా తెలియజేయబడెను. ఆదికాండము 46:2,3

2. దావీదు ఒక దర్శనమందు దేవుని తీర్పునొంది హెచ్చరింపబడెను. 1దిన 21:16

3. ఒక దర్శనమందు యెషయా దేవుని పరిశుద్ధతను చూచెను. యెషయా 6:1-8

4. దానియేలు ఒక దర్శనమందు గొప్ప అన్యశక్తులను చూచెను. దానియేలు 7-8

5. దానియేలు ఒక దర్శనమందు దేవుని మహిమలను చూచెను. దానియేలు 10:5-9

6. దానియేలు ఒక దర్శనమందు ఘనుడైన అలెగ్జాండర్ పురోభివృద్ధిని పతనమును చూచెను. దానియేలు 8

7. యెహెజ్కేలు ఒక దర్శనమందు చెదరిపోయిన ఇశ్రాయేలీయులు తిరిగి సమకూర్చబడుటను చూచెను. యెహెజ్కేలు 37

8. అననీయ ఒక దర్శనమందు పౌలుకు బోధింపవలెనని ఆజ్ఞాపింపబడెను. అపొ.కా 9:10

9. కొర్నేలీకి ఒక దర్శనమందు పేతురును పిలిపించవలసినదిగా తెలియజేయబడెను. అపొ.కా. 10:3-8

10. పేతురు ఒక దర్శనమందు కొర్నేలికి బోధింపుమని ఆజ్ఞాపింపబడెను. అపొ.కా. 10:10-16

11. పౌలు ఒక దర్శనమందు మాసిదోనియకు వెళ్ళుమని ఆజ్ఞాపించబడెను. అపొ.కా. 16:9

12. కొరింథులో ఒక దర్శనమందు పౌలు ఓదార్చబడెను. అపొ.కా. 18:9

13. యెరుషలేములో ఒక దర్శనమందు పౌలు ఓదార్చబడెను. అపొ.కా. 23:11

14. ఒక దర్శనమందు పౌలు మూడవ ఆకాశమునకు కొనిపోబడి దేవుని మహిమను చేసెను. 1కొరింథీ 12:1-4

15. అపొస్తలుడైన యోహాను ఒక దర్శనమందు ప్రకటన గ్రంథమును చెప్పెను.

### యుగములు

1. నిర్దోష యుగము (మానవుడు సృష్టింపబడిన కాలము నుండి పతనమైన కాలము వరకు) ఆది 1:28; 3:6

2. మనస్సాక్షి యుగము (మానవుని పతనమునుండి జలప్రళయము వరకు) ఆది 4:1-8; 14

3. మానవ ప్రభుత్వ యుగము (జలప్రళయము నుండి బాబెలు యొద్ద ప్రజలు చెదరగొట్టబడిన కాలము వరకు ఆది 8:15; 11:9

4. వాగ్దాన యుగము (బాబెలు గోపురము నుండి ఆది 11:10; సీనాయి పర్వతము వరకు) నిర్గమ 18:27

5. ధర్మశాస్త్ర యుగము (సీనాయి పర్వతము నుండి నిర్గమ. 19 - మేడ గది వరకు అపొ.కా. 1:26)

6. గొఱ్ఱెపిల్ల వధువైన సంఘ యుగము (మేడగది నుండి మధ్యాకాశమునకు సంఘము ఎత్తబడు వరకు) ప్రకటన 3:22

7. గొఱ్ఱెపిల్ల ఉగ్రతా యుగము-(శ్రమకాలము అపొ.కా. 2:1; సంఘము ఎత్తబడిన కాలమునుండి రెండవ రాకడ వరకు) ప్రకటన 3:22

8. గొఱ్ఱెపిల్ల పాలనా యుగము - వెయ్యేండ్ల పాలన (రెండవ రాకడ నుండి గొప్ప ధవళ సింహాసనపు తీర్పు వరకు) ప్రకటన 20:4-15

9. గొఱ్ఱెపిల్ల యొక్క నూతన సృష్టి యుగము - అంతములేని ప్రపంచము (గొప్ప ధవళ సింహాసనపు తీర్పు నుండి నిత్యత్వమంతా) ప్రకటన 21,22

## బైబిల్ క్విజ్-10 జవాబులు

1. దేవునిగా
2. మోషేకి 80, అహరోనుకి 83
3. నీరు రక్తముగా మారుట
4. ఏడు దినములకు
5. కప్పలు, 7వ అధ్యాయంలో
6. 3వ తెగులు
7. ఈగలు రావడం
8. గోషేను దేశములో
9. యెహోవాకు అర్పించవలసిన బలి విషయమై
10. మిక్కిలి బాధాకరమైన తెగులు, 5వ తెగులు
11. మనుష్యుల మీదను, జంతుల మీదను పొక్కులు పొక్కు దద్దురులాయెను
12. వడగండ్లు పడటం
13. జనుప చెట్లు
14. గోధుమలు మెరప మొలకలు
15. మిడతలు
16. ఎఱ్ఱ సముద్రములో
17. మూడు దినములు
18. గొఱ్ఱెపిల్లనైనను, మేకపిల్లనైనను
19. యింట్ల ద్వారబంధపు రెండు నిలువు కమ్ముల మీదను, పైకమ్మి మీదను
20. చేదు కూరలతో
21. అగ్నితో కాల్చివేయవలెను
22. నడుము కట్టుకొని చెప్పులు తొడుగుకొని, కఱ్ఱలు చేతపట్టుకొని, త్వరపడుచు దాని తినవలెను
23. ఏడు దినములు
24. పరిశుద్ధ సంఘముగా
25. ఇశ్రాయేలీయుల సమాజములో నుండకుండ కొట్టివేయబడును

# సత్యము మనలను స్వతంత్రులుగా చేయును

**- డి.విద్యావతి, విజయవాడ**

సత్యము ఎవరికి తెలుస్తుంది? శిష్యులకు (యోహా. 8:31). నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా చేయును. అంటే సత్యము శిష్యులకే తెలుస్తుంది. శిష్యులంటే ఎవరు? శిష్యులు అనగానే మన దృష్టిలో ఇల్లు, భార్య, పిల్లలను సమస్తమును విడిచి యేసయ్య కట్టుబట్టలతో వెంబడిస్తూ, సువార్తను బోధించాలి అని మనం అనుకుంటాము. కాని యోహా. 8:31 లోనే మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుందురు. అంటే వాక్యమందు నిలిచి ఉంటే చాలు శిష్యులైపోతారు. మన ఆస్తి, భార్యా బిడ్డలు అంటే కుటుంబ మును విడిచిపెట్టువలసిన పనిలేదు. నా (యేసయ్య) వాక్యమందు నిలుచుని ఉంటే చాలు. పేతురు ఒకసారి యేసయ్యతో మేము సమస్తమును (మత్తయి 19:28) విడిచి పెట్టి నిన్ను వెంబడించితిమి గనుక మాకేమి దొరుకునని యేసును అడుగగా. యేసు (28,29వ॥) నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రముల వారికి తీర్పుతీర్చుదురు. శిష్యులకు ఎంత గొప్ప భాగ్యము. నా నామము నిమిత్తము అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రును, తండ్రి, తల్లి, పిల్లలను, భూములనైనను, ఇండ్లనైనను విడిచిపెట్టిన ప్రతివాడు 100 రెట్లు (ఈ లోకములోనే) అంటే నా దృష్టి వీటిని నెంబర్ 1గా చేసి నా ప్రార్ధన కాకుండా నీతిని, రాజ్యముపై నా దృష్టి నెంబర్1 గా చేసినప్పుడు వీటన్నింటితో పాటు ఇదిగాక నిత్యజీవమును స్వతంత్రించుకొందురు. అంటే ఈ లోకములో మనమేమి నష్టపోవలసిన పని లేదు. ఇదికాక నిత్యజీవము సాతానుకు అందుబాటులో లేనిది, వాడు ఇవ్వనిది మనం యేసుయ్య ద్వారా స్వతంత్రించు కొనవచ్చును.

ఒకప్పుడు నేను కూడ లోకమును అనుసరించు దానిచే లోక పద్ధతులలోనే ఉండేదానను. ఏవి అంటే నలుగులు, పసుపులు వేయటం, గృహప్రవేశం జరిగినప్పుడు పాలు పొంగించటం ఇలా అనేకమైన లోక ఆచారాలు పాటించే దానను. ప్ర 3:15,16 లో నీక్రియలను నేనెరుగుదును, నీవు చల్లగానైనను, వెచ్చగానైనను లేవు, నీవు నులివెచ్చగా ఉన్నావు గనుక నేను నిను నా నోటి నుండి ఉమ్మి వేయ ఉద్దేశించుచున్నాను. ఈ వాక్యమును అనేక సార్లు చదివాను, ఈ వాక్యము మీద అనేక ప్రసంగములను విన్నాను. కాని ఒకసారి నా ఆత్మీయ చెవులకు ఈ మాటలు వినబడినప్పుడు ఆ వాక్యములోని సత్యము నా హృదయానికి గోచరమయి, నా ఆత్మీయ కన్నులు తెరువబడ్డాయి. అంటే లోక అధికారి సాతాను, సాతాను క్రియలను అనుసరించుచు, దేవుని కూడ ఆరాధిస్తూ నులివెచ్చని స్థితిలో ఉన్నాననే గ్రహింపు నాకు కలిగినప్పుడు దేవుడు నన్ను తన నోటి నుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నారు అని గ్రహించాను. వెంటనే ఆత్మీయ కన్నులను దేవుడు నన్ను ఉమ్మివేస్తే నేను లూసీఫర్ చేయి పట్టుకుని, వాడితో కూడ నరకములో ఉండటం చూచాను. ఇది చూడగానే నా గుండె పగిలినంత పని అయింది. ఇదేంటి నేను ఎల్లప్పుడు యేసయ్యతోనే ఉండాలని కదా! నా ఆశ, నా కోరిక, అందుకే కదా చర్చికి వెళ్తు, బైబిల్ చదువుతూ, ప్రార్ధన చేస్తున్నంది. ఇదేంటి నేను వీడి చేయి పట్టుకుని ఉన్నాను. ఈ లోకంలో నా క్రియలు వలన వాడికి నా చేయిపట్టుకునే అధికారం ఇచ్చాను అని ఎప్పుడు తెలుసు కున్నానో వెంటనే పశ్చాత్తాపముతో దేవుని యొద్ద క్షమాపణ పొందాను. పశ్చాత్తాపడు అంటే దేవుని యొద్ద ఒప్పుకుని, వెంటనే విడిచిపెట్టటం. వెంటనే దేవునితో ఒక నిబంధన చేసుకుని, ఇక మీదట లోకపు ఆశలపై, పద్ధతులు, ఆచారాల వైపు చూడనని, యేసయ్యను (వాక్యమును) వెంబడిస్తానని ఒప్పుకున్నాను. యేసయ్య మాటను ఎప్పుడయితే తెలుసు కున్నానో నాకు సత్యము తెలిసింది. ఆ సత్యము మనం ఆ మురికిలోనికి, లోకము లోనికి వెళ్ళకుండా నా ప్రాణమునకు విడుదుల వచ్చి, లోకము నుండి స్వతంత్రురాలిగా చేసింది. అప్పటినుండి ఆ వాక్యము నందు నిలిచి ఉన్నాను. కాబట్టి సత్యం గ్రహించటం చాలా ముఖ్యం. అందుకే మత్తయి

13:23 మంచినేలను విత్తబడిన వాడు వాక్యము విని గ్రహించువాడు 100%, 60%, 30% ఫలమిచ్చును.

ఇంకో విషయం యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు అని చాలామంది అంటుంటారు. ఈ మాట, ఈ ప్రార్థన దావీదు మహారాజు చేసింది. అనేకమంది పాస్టర్లు కూడ ఈ వాగ్దానము మీకు అని ఈ వాక్యమును తీసి వాళ్ళకు ఇస్తుంటారు. యెహోవా దావీదుకు కాపరి. ఇది ఆయన ప్రార్థన. ఆయన కీర్తన. దేవునికి మోషే, దావీదు, ఆసాపు కోరహు కుమారులు వాళ్ళు పాడిన పాటలు, ఎక్కడా దేవుని మాటలు ఈ కీర్తనలలో వారితో దేవుడు మాట్లాడినట్లు కనబడదు. దేవుని వాళ్ళు రుచి చూసి తెలుసుకుని, వారికి దేవుడు ఆశ్రయముగా, కాపరిగా, కోట, కొండ, ఆపదలలో నమ్మదగిన సహాయకుడుగా ఉన్నారని వాళ్ళు అనుభవించిన సత్యమును ఆనందముగా, కృతజ్ఞతగా చెప్పుకున్నారు. దావీదు తన జీవితములో చేసిన ఒక్క తప్పు, అదీ తప్పని దావీదు అనుకోలేదు. 750మంది భార్యలు, వాళ్ళతో పాటు బత్షెబ అనుకున్నాడు. దేవుడు తనతో మాట్లాడుట లేదు, సన్నిధి లేదు అని మర్చిపోయాడు. నాతాను దావీదు వద్దకు వచ్చి బత్షెబా భర్తను దావీదు మోసముతో చంపిన విషయం దేవుని దృష్టికి దుష్కార్యముగా కనబడినది అని చెప్పే వరకు దావీదు గుర్తించలేదు. వెంటనే సింహాసనము దిగి, నేను పాపము చేసితినని దావీదు తెలుసుకుని ఈ జిగటగల దొంగ ఊబి నుండి నన్ను ఎవరు రక్షిస్తారు. నా పాపములను, నా అతిక్రమములను మీ యొద్ద ఎలా దాచిపెట్టగలను, ఆకాశమందు ఎక్కినను నీవు అక్కడ ఉన్నావు, భూమి క్రింద దాగినా అక్కడను నీవున్నావు. సముద్రము అడుగునా అక్కడను నీవున్నావు అని తన తప్పును తెలుసుకుని తన అంతరంగములోనుండి దేవునికి విజ్ఞాపన ప్రార్థన, పశ్చాత్తాపముతో తన అతిక్రమములను క్షమించమని సత్యములో అడిగినప్పుడు దావీదు అంతరంగములోని సత్యము దేవునికి నచ్చి దావీదును క్షమించారని 32వ దావీదు కీర్తనలో ఆనందంగా యెహోవా చేత నిర్దోషిగా ఎంచబడినవాడు ధన్యుడని వ్రాసాడు. నీవు చేసింది తప్పు అని దావీదుకు చెప్పినప్పుడు ఒక్క మాటతోనే తన తప్పు తెలుసుకుని దేవుని యొద్ద క్షమాపణ అడిగి ఇక తప్పు చేయలేదు. దావీదులాంటి ప్రార్థన మీరు చేస్తారా? మీ క్రియలు, లోకంలో మీ నడక, మీ మాట, మీ ఆలోచనలు, మీ కోరికలు, మీ ఆచారాలు, పద్ధతులు, లోకానుసారముగా ఉన్నాయని, వాక్యానుసారంగా లేవని మీకు చెప్తే మీరు వింటారా నమ్ముతారా? ఉ॥ గృహప్రవేశం చేసేటప్పుడు పాలు పొంగించి పరమ్మానం చేసి అందరికిపెట్టి, అక్కడ పాస్టరు ప్రార్థన, ఆ కార్యక్రమమును దీవించుమని దేవునికి హెచ్చరిక, కొంచెం ఆలోచించండి చేసేది లోక పద్ధతి, లోక అధికారి సాతాను, సాతానును ముందుగానే ఆహ్వానించి, వాడిని నెంబర్1 గా చేసి, వాడికిష్టమైన విధంగా కార్యక్రమము చేసి, ఇది ముగిసిన తరువాత ప్రార్థన కూడిక, దేవునికి ఆరాధన, దేవుడు ఈ ఇల్లు ఇచ్చాడని కృతజ్ఞతతో కూడిన సాక్ష్యం, పాస్టరు దీవెన, ఎలాగండి? నీ దేవుడు సాతానయితే నీకు ఇల్లు ఇచ్చింది వాడే కదా! సృష్టికర్త ఎలా వస్తారు. నీవు చేసేదంతా చేసి ఏమి తెలియదన్నట్లు దేవుని ఆహ్వానిస్తే దేవుడు వస్తారా? ఆయన అంత సులువుగా వస్తారనుకుంటున్నారా? నీవు నులివెచ్చని స్థితిలో ఉంటే దేవుడు ఆ ప్రార్థన కూడికకు వస్తారా? దేవుడు వెఱ్ఱివాడనుకుంటున్నారా? ఒక్క నిముషం ఆలోచించండి. దేవుడు ఆశీర్వదిస్తే పాలు పొంగించారా? ఆయన ఆశీర్వదిస్తే ఒక ద్వారము గుండా కాదు. ఆకాశపు వాకిళ్ళు విప్పుతారు. అంటే అన్నివైపులా ఆశీర్వాదమే కదా? పట్టజాలనంతగా ఆశీర్వదిస్తారు గదా! ఈ దేవుని మాటను పట్టుకుని నిలిచారా? నిలిస్తే శిష్యులే. ఈ దేవుని మాటను విడిచి లోకం చెప్పే పద్ధతులను పట్టుకున్న వారికి ఆయన ఎలా కాపరిగా ఉంటారు. ఆశ్రయం ఎలా? దుర్గము ఎలా? దయచేసి ఆలోచించండి సత్యమును తెలుసుకోండి. దావీదుకు ఒక్కసారి చెప్తేనే వెంటనే దేవుని వైపు తిరిగాడు. మీతో ఎన్నిసార్లు దేవుడు మాట్లాడి ఉంటారు. దేవుడు ఒక్కమారు మాట్లాడుతారు, 2మార్లు మాట్లాడుతారు. ఆయన కనికరమువలనబట్టి మూడవసారి. తరువాత నోటి నుండి ఉమ్మి వేయటమే. ఎంత భయంకరం సాతానుతో నరకములో ఉండటం. 10ని॥ ఆలోచించండి. ఆత్మీయ కన్నులు తెరచి చూడండి. వాక్యమందు నిలిచి శిష్యులై సత్యం తెలుసుకోండి. సత్యమే మనలను స్వతంత్రులుగా చేస్తుంది. ఆత్మ చెప్పుచున్న మాటలు చెవిగలవాడు వినును గాక!



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 11

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. ఇశ్రాయేలీయులు సుక్కోతుకు ప్రయాణమై పోయి నప్పుడు కాల్బలము ఎంత?
2. ఇశ్రాయేలీయులు ఐగుప్తులో నివసించిన కాలం?
3. ఇశ్రాయేలీయుల సర్వసమాజం ఏ పండుగను ఆచరించవలెను?
4. ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయుల ఏ నెలలో బయలుదేరి వచ్చితిరి?
5. దేవుడు ప్రజలను చుట్టు దారియగు ఏ సముద్రపు ఆరణ్య మార్గమున నడిపించెను?
6. వారు షూరు ఆరణ్యములోనికి వెళ్ళి ఎన్ని దినాలు ఉండిరి?
7. ఏ దినమున ఏలీమునకును, సీనాయికిని మధ్యనున్న సీను అరణ్యమునకు వచ్చిరి?
8. ఏ దినమున వారు తెచ్చుకొనిన దానిని సిద్ధపరచుకొన వలెను?
9. సాయంకాలమున ఏవి వచ్చి వారి పాళెమును కప్పెను?
10. ప్రతి వాడును తన వారి భోజనమునకు, తన కుటుంబ ములోని వారికి ఎంత చొప్పునకూర్చుకొనవలెను?
11. మన్నా అనగానేమి?
12. ఎక్కడ మోషేకు ఎదురుగా నిలిచెదనని యెహోవా చెప్పెను?
13. మోషే కట్టిన బలిపీఠము పేరు?
14. ఏ రోజు యెహోవా ప్రజలందరి కన్నుల ఎదుట సీనాయి పర్వత మీదికి దిగివచ్చెను?
15. దేవుడు ఎవని మీద నేరము స్థాపించునో వాడు తన పొరుగువానికి ఎంత అచ్చుకొనవలెను?
16. సంవత్సరమునకు ఎన్ని మార్లు పురుషలందరు ప్రభువైన యెహోవా సన్నిధిని కనబడవలెననెను?
17. మోషే ఆ కొండ మీద ఎన్ని దినములుండెను?
18. న్యాయవిధాన పతకములో వేటిని ఉండవలెను?
19. ధర్మశాస్త్రంలోని మొదటి ఆజ్ఞ ఏమిటి?
20. ధర్మశాస్త్రంలోని 4వ ఆజ్ఞ ఏమిటి?
21. ధర్మశాస్త్రంలోని 6వ ఆజ్ఞ ఏమిటి?
22. ఎన్ని దినములు బలిపీఠం నిమిత్తము ప్రాయశ్చిత్తం చేసి దాని పరిశుద్ధపరచవలెను?
23. యెహోవా యూదా గోత్రములో ఎవరిని పిలిచెను?
24. లేవీయులు మోషే మాటచొప్పున చేయగా, ఆ దినమున ఇంచుమించు ఎన్నివేల మంది కూలిరి?
25. మనుష్యుడు తన స్నేహితునితో మాట్లాడునట్లు, యెహోవా ఎవరితో ముఖాముఖిగా మాటలాడెను?

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**బ్రదర్ జాన్‌పాల్**

అజ్జారం, కాకరపర్రు, ప.గో.జిల్లా

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.